ప్రజాశక్తి
సోమవారం 18 ఆగస్టు 2025 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

బంగాళా ఖాతంలో అల్ప పీడనం

- భారీ వర్ష సూచన
- బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో ఆరంజ్ అలర్ట్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం సోమవారం వాయుగుండంగా బలపడు తుందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేశారు. ఈనెల 19న దక్షిణ ఒడిశా - ఉత్తరాంధ్ర వద్ద తీరం దాటే అవకాశం ఉందని,బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నంద్యాల జిల్లాలకు ఆరంజ్ అలర్ట్ ప్రకటిం చారు. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని,ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

నేడు 'పిజిఆర్ఎస్' రద్దు

ప్రకాశం బ్యారేజ్‌కు వరద నీరు అధికంగా వస్తున్న దష్ట్యా జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ముందస్తు చర్యలలో భాగంగా సోమవారం నిర్వహించాల్సిన ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు ఈ విషయం గమనించాలని ఆయన సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు ఎస్‌పి తుషార్ డూడి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రకాశం బ్యారేజ్‌కు వరదనీరు అధికంగా చేరుతున్న దష్ట్యాకార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

విజేతలను అభినందిస్తున్న ఎమ్మెల్యేలు

ఒంగోలులో ఆల్ ఇండియా కరాటే పోటీలు అభినందనీయం

- ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్థన్‌రావు

5లో

'పి-4' కుస్తీలు

- సగం మంది పేదలకు మార్గదర్శకులు భర్తీ
- మిగతా వారికోసం వెతుకులాటలో నేతలు

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

పి-4 పథకంపై రాష్ట్రవ్యాప్తంగా పలు రకాల చర్చలు సాగుతున్నాయి.ఆచరణలో సాధ్యం కాని పథకంగా చర్చ తెరపైకి వచ్చింది. దీన్ని అమలు రాష్ట్ర ప్రభుత్వానికి సవాలుగా మారింది. పార్టీనేతలకూ, అధికారులకూ తలనొప్పిగానే భావిస్తున్నారు. పై నుంచి ఒత్తిడితో హడావిడిగా మార్గదర్శులను గుర్తించి పేదలకు అనుసంధానం చేశారు. వీళ్లే భవిష్యత్‌లో పేదలను అట్టడుగుస్థానం నుంచి పైకి తీసుకువచ్చే బాధ్యత తీసుకోవాలి. ఆర్థిక చేయూత కన్నా వారికి నిరంతరం జీవితం ఎదుగుదలకు సూచనలు,సలహాలు ఇచ్చే గైడ్‌గా ఉండాలన్నదీ ఇందులో పేర్కొన్నారు. నియోజకవర్గాల వారీగా పేదలను గుర్తించారు. వారికి వెంటనే మార్గదర్శులను గుర్తించి పేదలను వారికి అప్పగించాలనే ఒత్తిళ్ళు ఇటీవల ఎమ్మెల్యేలకూ వచ్చాయి. అందుబాటులో ఉన్న నేతలు, కార్యకర్తలు, వ్యాపారులను గుర్తించి వారికి దత్తత చేశారు. వీళ్ల ఎంత మేరకు పేదలను ఉద్ధరిస్తారన్నదే చూడాలి. ఆచరణలో ఏ మేరకు సాయం చేయగలరో వేచిచూడాలి. జిల్లాలో 74,911 పేద కుటుంబాలను గుర్తించారు. వీరికి బంగారుకుటుంబాలుగా నామకరణం చేశారు.ఇప్పటి వరకూ 7,073 మంది మార్గదర్శులను గుర్తించారు. 44,607 కుటుంబాలను దత్తతతీసుకున్నట్లు అధికారులు గణాంకాల్లో వెల్లడించారు. మిగిలిన కుటుంబాలకు మార్గదర్శులను అన్వేషిస్తున్నారు. ఇంకా 34వేల కుటుంబాలకు మార్గదర్శులు కావాల్సి ఉంది. ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని యంత్రాంగం, పార్టీ నేతలు కుస్తీలు పడితేనే సగం మంది పేదకుటుంబాలకు మార్గదర్శులు దొరికారు. మిగతా కుటుంబాలకు ఎవరన్నదీ తేల్లేదు. ఎందుకంటే సంపన్నులు ముందుకు వచ్చి పేదలను దత్తత తీసుకోవాలని సిఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు, డబ్బున్న ప్రముఖులు ముందుకు రావాల్సి ఉండగా ఆయా వర్గాలనుంచి ఆశించిన స్పందనలేదు. దీంతో ఎమ్మెల్యేల గ్రామాల్లో కొందరిని ఎంపిక చేసి మార్గ దర్శులుగా గుర్తించి ప్రభుత్వానికి పంపారు. ఉద్యోగులను మార్గదర్శులుగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది.ఎవరూ ముందుకు రాలేదు.మధ్యలో ఉపాధ్యాయులపై ఒత్తిడి తెచ్చారు. వీరి నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో విరమించుకున్నారు. ఇంకా సగం మందికి మార్గదర్శులు దొరకాల్సి ఉంది. ఆశించిన స్పందన లేదు. ఈపథకం ఉద్దేశంపైనే గందరగోళం నెలకొంది. ప్రభుత్వ-ప్రవేటు-ప్రజల బాగస్వామ్యంతో ఈ కార్యక్రమం నడవాలి. 2029 నాటికి ఈ పథకం ద్వారా పేదరికంలేని జిల్లాను తయారు చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇది సాధ్యమేనా?అనేదే ఇపుడు జరుగుతోన్న చర్చ. పేద కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఎటూ అందాల్సినవి అందుతాయి. వాటికి అదనంగా మార్గదర్శులు ఏంచేస్తారన్నదే ఇపుడు ఆలోచించాలి. వీరి జీవన పరిస్థితులు మెరుగుకోసం ఎంతోకొంత ఆర్థిక చేయూత కూడా అవసరం. మార్గదర్శులుగా ఉన్న వాళ్ల ఎంత మేరకు తాము దత్తత తీసుకున్న కుటుంబాలకు ఆర్థిక సాయం చేయగలరో కూడా కీలకంగా ఉంది. ఇక ఈ కుటుంబాల్లో జరిపిన సర్వేలో ఎక్కువ శాతం మంది ఉద్యోగాలు, రుణాలు అడిగారు. ఇవి మార్గదర్శులు తీర్చే పరిస్థితి లేదు. ఇంకా అనేక రకాలుగా అవసరాలు సూచించారు. ప్రభుత్వం ఇచ్చే పథకాలు చర్చలోకి రాలేదు. పేద కుటుంబాల అవసరాలు తీర్చే దాన్ని బట్టి కూడా ఇక్కడ ఆచరణ అనేది ఆధారపడింది. దీని ఉద్దేశం కన్నా అమలుపైనే పలు సందేహాలు కలుగు తున్నాయి. దాతలు సాయంతో పేదల కుటుంబాలు నిజంగా బయటపడతాయా ?దీని ద్వారా పేదరికం లేని సమాజం ఎక్కడైనా తయారైందా? అనే ప్రశ్నలు ముందుకొచ్చాయి. పేదరికం పోవాలంటే అనేక మార్గాలు ఉన్నాయి.ప్రతి పేద కుటుంబానికి భూమి అవసరం. మిగులు భూములు, ఆక్రమణల్లో ఉన్న అసైన్‌భూములను పేదలకు ఇస్తే చాలా మేరకు పేదరికం తగ్గించవీలుంది. ఈ దిశగానూ చర్యలు చేపట్టాలి. పరిశ్రమలు స్థాపించి ఉపాధి కల్పించడం ద్వారానూ పేదరికం తగ్గించే అవకాశం ఉంది.ఈ దిశగా ఆలోచనలు ఈ పి-4లో కనిపించడం లేదు.

ఎరువుల ధరలు పైపైకి..

- ధరలు పెంచిన ఎరువుల కంపెనీలు
- బస్తాపై రూ.100 నుంచి రూ.200 పెరిగిన వైనం
- అన్నదాతల ఆందోళన
- పట్టించుకోని ప్రభుత్వాలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ప్రకృతి వైపరీత్యాలతో రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై ఎరువుల ధరలు పెంచాయి. దీంతో అన్నదాతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. మరోవైపు సప్లయ్ ప్లాన్ ప్రకారం జిల్లాకు ఎరువులు లేదు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఏటా దాదాపు 4.50 లక్షల టన్నుల రసాయన ఎరువులు వినియోగిస్తున్నారు. 50 కిలోల ఎరువు బస్తాపై కనిష్టంగా రూ.100 నుంచి రూ.200 వరకూ పెంచారు. టన్నుపై గరిష్టంగా రూ.2,000 పెరిగింది. ఎరువుల కంపెనీలు ధరలను అడ్డగోలుగా పెంచుతున్నా కేంద్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పెరుగుతున్న రసాయన ఎరువుల వినియోగం..

జిల్లా వాప్తంగా సాధారణంగా ఖరీఫ్ సీజన్‌లో 4,99,756 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తారు. ఈ దఫా ఖరీఫ్‌లో 3,70,307 ఎకరాల్లో సాగవుతుందని వ్యవసాయాధికారులు అంచనాలు వేస్తున్నారు. యర్రగొండ పాలెం నియోజకర్గ పరిధిలోని యర్రగొండపాలెం మండలంలో 7,622 హెక్టార్లు సాధారణ సాగు విస్తీర్ణం కాగా, 5,738 హెక్టార్లలో పంటలు సాగయ్యే అవకాశం ఉంది. పుల్లలచెరువు మండలంలో 10,099 హెక్టార్లకు గాను 5,063 హెక్టార్లు, త్రిపురాంతకం మండలంలో 7,719 హెక్టార్లకు గాను 4966 హెక్టార్లు, పెద్దదోర్నాల మండలంలో 4,351 హెక్టార్లకు గాను, 3,139 హెక్టార్లలో ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగవుతాయని వ్యవసాయాధికారుల అంచనా. మిర్చి, పత్తికి పెద్ద ఎత్తున కాంప్లెక్స్

2లో

పూర్తి కాని కాలువల మరమ్మతులు

- తెగుతున్న గట్లు
- రైతుల ఆందోళన
- పట్టించుకోని అధికారులు

కాలువ గండికి ఇసుక బస్తాల చేపట్టిన తాత్కాలిక మరమ్మతులు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

కాలువ చివరి భూములకు సాగునీరు అందాలంటే పూర్తి సామర్థ్యంతో నీరు విడుదల చేయాలి. అలా చేస్తే పటిష్టంగా లేనందున కాలువల కట్టలు తెగిపోతాయి. ఈ వ్యవసాయ సీజన్‌లో నైనా కాలువలను పటిష్ట పరుస్తారని రైతులు ఆశించారు. అలా జరుగలేదు. ప్రస్తుతం వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో పంట కాలువల మరమ్మతు పనులు నిలచిపోయ్యాయి.దీంతో ఈ సీజన్‌లో కూడా రైతులకు సాగు నీటి కష్టాలు తప్పేలా లేవు.

కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలోని కాలువల మరమ్మతు పనులకు రూ. రూ 25 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో 746 పనులు చేపట్టాల్సి ఉంది. ఆ పనులను నూతనంగా ఎన్నికైన సాగునీటి సంఘాలకు నామినేషన్ పద్ధతిపై అప్పుజెప్పారు. పనులను వేసవిలో చేపట్టి ఖరీఫ్ సాగుకు ముందే పూర్తి చేయాల్సి ఉంది. కృష్ణా పశ్చిమ డెల్టా కాలువల మరమ్మతు పనులను ఆలస్యంగా మొదలు పెట్టారు.జాన్ నెలలో వర్షాలు పడటం మొదలయ్యాక పనులు ప్రారంభించారు. దీంతో కాలువలను బాగుచేసే పనులు పూర్తి కాలేదు. ఈ లోపు ఎగువ ప్రాంతంలో విస్తారంగా వర్షాలు పడి జలాశయాలు నిండాయి. కృష్ణా బ్యారేజి నుంచి పంట కాలువలకు నీటిని వదిలారు.రైతులు మాగాణి సాగు మొదలు పెట్టారు. వరిని ఎద పద్ధతిలో కొంత మేర, నాట్ల ద్వారా వ్యవసాయ పనులు పుంజుకున్నాయి.కాలువల ద్వారా సమృద్ధిగా

2లో

పూర్తికాని కాలువల మరమ్మతులు

(మొదటిపేజీ తరువాయి)

నీరు వస్తుంది. ఈ దశలో బలహీనంగా ఉన్న కట్టలు తెగిపోతున్నాయి. ఫలితంగా రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట కాలువల కట్టలు తెగిన చోటల్లా ఇసుక బస్తాలతో తాత్కాలికంగా మరమ్మతులు చేసుకుంటున్నారు. పంట కాలువల ద్వారా సక్రమంగా సాగునీరు పొలాలకు చేరాలంటే ప్రతి ఏటా వేసవిలోనే కాలువల మరమ్మతు పనులు చేపట్టి వర్షాలు కురిసే నాటికి పూర్తి చేయాలి. అలాగైతేనే రైతులకు మేలు జరుగుతుంది. ఇందుకోసం ముందుగానే చేపట్టాల్సిన పనుల అంచనాలు రూపొందించాలి. ప్రభుత్వ అనుమతులు, నిధుల మంజూరు పొందాలి. గత వైసిపి ప్రభుత్వ హయాంలో సక్రమంగా సకాలంలో కాలువల మరమ్మతు పనులు చేపట్టిన పరిస్థితి లేదు. దీంతో రైతులు ఏటా నష్టపోతూ వచ్చారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వంలోనైనా సకాలంలో పంటకాలువల పనులు చేపడతారని రైతులు భావించారు. అలా జరిగిన పరిస్థితి లేదు. కాలువ చివరి భూములకు సాగునీరు చేరాలన్నా, కాలువల ద్వారా పూర్తి స్థాయి నీటి సరఫరా జరగాలన్నా, కాలువల్లో పూడికతీత పనులు,గుర్రపుడెక్క, జమ్ము తొలగించాలి. కాలువ గట్లను పటిష్టపరచాలి. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నాటికి ఈపనులు పూర్తి అయితేనే పంటల సాగు సజావుగా సాగుతుంది. కూటమి ప్రభుత్వ హయాంలోనూ కాలువలను పట్టిష్ట పరిచే పనులు చేపట్టలేదు. గుర్రపుడెక్క, జమ్ము తొలగించే పనులు మాత్రమే చేపట్టారు. అవి కూడా పూర్తి స్థాయిలో జరగలేదు. కాలువల మరమ్మతు పనులను సాగునీటి సంఘాల ద్వారా చేపట్టాలని నిర్ణయించారు. టెండర్లు లేకుండా నామినేషన్ పద్ధతిపై సాగునీటి సంఘాలకు పనులు అప్పజెప్పారు. గత మేలో నిర్వహించిన జిల్లా అభివృద్ధి మండలి సమీక్షా సమావేశంలో పాల్గొన్న మంత్రులు గొట్టిపాటి రవికుమార్, కె. పార్థసారథి పంట కాలువల మరమ్మతు పనులు వర్షాలు రాకముందే పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందుకోసం పనుల పర్యవేక్షణకు ప్రతి రెండు కిలోమీటర్లకు ఓ ఇంజినీరింగ్ అసిస్టెంట్, ఏఇలను నియమించాలని అధికారులను సూచించారు. వర్షాలు మొదలవుతుంటే పనులు ఎప్పుడు చేస్తారు, ఎలా పూర్తవుతాయి. పంట కాలువల మరమ్మతు పనులు నామమాత్రంగా నిర్వహించి బిల్లులు పెట్టుకోవడానికా అంటూ ఇరిగేషన్ అధికారులను ఆ సమావేశంలో మంత్రులు నిలదీశారు. అయినా ఫలితం శూన్యం.అనుకున్నట్లు గానే వర్షాలు మొదలయిన జూన్ నెలలో పనులు ప్రారంభించారు. వర్షాలు కొనసాగుతున్న క్రమంలో కాలువ పనులన్నీ అరకొరగానే జరిగాయి.

గత ఏడాది సెప్టెంబర్ భారీవర్షాల కారణంగా పంటలు నీట మునిగి రైతులు నష్టపోయారు. వరద ప్రభావంతో దెబ్బతిన్న పంట కాలువలకు తాత్కాలిక మరమ్మతులు చేయడానికి అప్పట్లో 148 పనులు గుర్తించారు. ఇందుకోసం రూ.7.75 కోట్ల నిధులు మంజూరయ్యాయి. టెండర్లు పిలిచారు. అయినప్పటికీ పనులు పూర్తి కాలేదు.ప్రస్తుతం కాలువ మరమ్మతు పనులు సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ పలు రకాల కారణాలతో పనులు పూర్తి కాని పరిస్థితి ఉంది. పనులు పూర్తికాకపోవడంతో చివరి భూములకు నీరందలేదు. కొంచెం ఎక్కువ సామర్థ్యంతో నీరు విడుదల చేస్తే కాలువల కట్టలు తెగిపోతున్నాయి. తక్కువ పరిమాణంలో నీరు విడుదల చేస్తే చివరి భూములకు నీరందని పరిస్థితి ఉంది. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంది. పంట చేలో ఉన్న సమయంలో కాలువ గట్లు తెగితే రైతులు నష్టపోయే ప్రమాదముంది.ఈ నేపథ్యంలో బలహీనంగా ఉన్న కాలువ కట్టలకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఉత్తమ ఎంఎస్ఐగా నాగలక్ష్మి

ప్రజాశక్తి-తర్లుపాడు

తర్లుపాడు పోలీస్ స్టేషన్లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఎం నాగలక్ష్మి విధుల పట్ల నిబద్ధతతో పని చేసినందుకుగాను ఉత్తమ సేవ అవార్డుకు ఎంపికయ్యారు. శుక్రవారం ఒంగోలు పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో జరిగిన భారతదేశ 79వ స్వతంత్ర దినోత్సవ వేడుకలు కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల శ్రీబాల వీరాంజనేయ స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ ఏఆర్ దామోదర్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

మంత్రి స్వామి చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న నాగలక్ష్మి

ఉపాధి పనులకు ఆటంకంగా చిరుజల్లులు

ప్రజాశక్తి-కొమరోలు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో కురుస్తున్న చిరుజల్లులు వ్యవసాయ కూలీలకు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో గత 8 రోజులుగా కొమరోలు మండలంలో చిరుజల్లులు కురుస్తున్నాయి. ప్రతిరోజూ తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి ఉదయం ఏడు గంటల వరకూ తేలికపాటి జల్లులు కురుస్తున్నాయి. ఆకాశం మేఘాలతో నిండి ఉంటూ అప్పుడప్పుడూ ఆకస్మికంగా జల్లులు కురుస్తున్నాయి. ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లే కూలీలు ఉదయం 6 గంటలకు ఆటోలలో వెళ్లి పనులు ముగించుకొని మధ్యాహ్నానికి ఇండ్లకు చేరుతున్నారు. అలాగే వ్యవసాయ కూలీలు కూడా ఉదయం 9 గంటలలోపే పనులకు వెళుతున్నారు. అయితే గత 8 రోజులుగా కురుస్తున్న తేలికపాటి చిరుజల్లులు ఉపాధి హామీ పథకం కూలి పనులకు అవరోధం కలిగిస్తున్నాయి. పొలాలు బురదమయంగా మారడంతో వ్యవసాయ కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. గత 8 రోజులుగా కురుస్తున్న చిరుజల్లుల వల్ల చేతివృత్తుల వారు, రోడ్ల అంచుల్లో తోపుడు బండ్లు పెట్టుకొని వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులకు, కష్టనష్టాలకు గురవుతున్నారు. కొమరోలు మండలంలో నువ్వు పంట దాదాపు 700 ఎకరాల్లో సాగు చేశారు. ఈ చిరుజల్లుల వల్ల నువ్వు పంటకు పూర్తిగా నష్టం వాటిల్లిందని రైతులు తెలిపారు. ఒకటి రెండు రోజులు పాటు భారీ వర్షాలు కురిసి ఆ తరువాత వాతావరణం అనుకూలిస్తే అందరికీ ప్రయోజనకరంగా ఉంటుందని, అలా కాకుండా ప్రతిరోజూ అప్పుడప్పుడు వర్షాలు కురుస్తున్నందువల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని పలువురు వాపోతున్నారు. ఇక తేలికపాటి వర్షాలతో రోడ్లన్నీ బురదమయంగా మారడంతో పాదచారులు, వృద్ధులు, విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మరో నాలుగు రోజులపాటు తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు ప్రకటిస్తున్నారు. దీనితో వ్యవసాయ ఉపాధి పథకం కూలీలు, చిరు వ్యాపారులు, నూగు పంట రైతులు మరింత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా గత వారం రోజులుగా కురుస్తున్న తేలికపాటి వర్షాలు పొలాల్లో సాగుచేసిన సజ్జ పంటలకు మాత్రమే ప్రయోజనకరంగా ఉంటుందని రైతులు తెలుపుతున్నారు. నువ్వు పంట పూర్తిగా నష్టపోవటం బాధిత రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

నూతన అంబులెన్స్ ప్రారంభం

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి పట్టణంలో దర్శి రోడ్డులో మానవత శాఖ నూతన భవనాన్ని ఆదివారం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్ రామచంద్రారెడ్డి, స్థలదాత వెలిశెట్టి వెంకటేశ్వర్లు సంయుక్తంగా ప్రారంభించారు. పై అంతస్తు భవనాన్ని ప్రముఖ వ్యాపారవేత్త, ఏపీఆర్ గ్రూప్స్ చైర్మన్ ఆవుల కృష్ణారెడ్డి ప్రారంభించారు. ముందుగా నూతన భవనానికి వెళ్లే సిమెంట్ రోడ్డును పేర్ల శ్రీనివాసరావు, వెలిశెట్టి వెంకటేశ్వర్లు సంయుక్తంగా ప్రారంభించారు. భవన శిలాఫలకాన్ని వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్ రామచంద్రారెడ్డి ఆవిష్కరించారు. నూతన అంబులెన్స్‌ను దాతలు పేర్ల శ్రీనివాసరావు, రవ్వ సుబ్బారావు రిబ్బన్ కత్తిరించి ప్రారంభించి ప్రజలకు అంకితం ఇచ్చారు. దాత గోలమారి చెన్నారెడ్డి సమకూర్చిన ఫ్రీజర్ బాక్సును ఆవుల కృష్ణారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ముందుగా ఎస్‌వికెపి డిగ్రీ కళాశాల ఆవరణలోని దివంగత ముప్పవ శ్రీహరిరావు విగ్రహానికి మానవతా సేవా సంస్థ ప్రతినిధులు పూలమాలలు వేసి స్మరించుకున్నారు. వారి కుమారుడు ముప్పవ పార్థ సారథి మానవతా సంస్థకు చేస్తున్న సేవలను రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్రారెడ్డి కొనియాడారు. చిట్టెం కృష్ణారావు అల్పాహారం దాతగా అందరికీ ఆతిథ్యం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ముప్పవ పార్థు, కల్లం సుబ్బారెడ్డి, కాటూరి వెంకట నారాయణ బాబు, వెలిశెట్టి వెంకటేశ్వర్లు, సామంతపూడి నాగేశ్వరరావు, తానికొండ వెంకట్రావు, బండి అశోక్, కే యలమందారెడ్డి, సోమిశెట్టి చిరంజీవి, ఎన్ శ్రీనివాసరెడ్డి, జి చెన్నారెడ్డి, పై వెంకటేశ్వర రెడ్డి, బి సుమంత్, బీవీ రెడ్డి, బి విజయలక్ష్మి, వి శిరీష రమణారెడ్డి, ఎస్ శ్రీదేవి, వి శ్యామల మల్లికార్జునరావు, వివిధ శాఖల సభ్యులు పాల్గొన్నారు.

ఎరువుల ధరలు పైపైకి..

(మొదటిపేజీ తరువాయి)

ఎరువులు, డీఏపీ వినియోగిస్తారు. రైతులు ఎక్కువగా ఉపయోగించే 14-35-14, 20-20-0-13, 16-20-0-13, 10-26-26, 15-15-15-15-9, 12-32-16, 16-16-16, 24-24-0, 12-32-16, సింగిల్ సూపర్ ఫాస్పెట్ ఎరువుల ధరలే పెరగడం వల్ల ఒక్కో రైతుపై రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు భారం పడుతోంది.

ఎరువుల భారం పెరిగిపోతోంది

పాశం వెంకటేశ్వర్లు, రైతు, కుందంపల్లి

ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పత్తి, కంది పంటలకు ఎకరాకు 4 బస్తాల ప్రకారం ఎరువులు వినియోగిస్తాం. ఎరువుల ధరలు పెరిగిపోవడం వల్ల ఏడాదికి రూ.40 వేల వరకు భారం పడుతోంది. కేంద్రం రసాయన ఎరువుల ధరలు పెంచడం దారుణం. ఇప్పటికే ఎరువుల ధరలు ఆందోళన కలిగిస్తుండగా తాజాగా మరింత పెంచడం తగదు.

పెట్టుబడులు పెరిగాయి

ముండ్లా దానియేలు, రైతు, గుర్రపుశాల

రసాయన ఎరువుల ధరలు ఇష్టానుసారంగా .పెంచడంతో పెట్టుబడులు పెరిగి పోతున్నాయి. అసలే వాతావరణ అననుకూల పరిస్థితులు ఒకవైపు, మరిఖల్ల మరోవైపు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో పెరుగుతున్న ఎరువుల ధరలు మరింత ఇబ్బందిగా మారాయి. పెట్టుబడులు విపరీతంగా పెరిగిపోతున్నాయి.

ధరలు పెరగకుండా నియంత్రించాలి

దుగ్గెంపూడి తిరుపతిరెడ్డి.

రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి

ఎరువుల కంపెనీలు వారి ఇష్టానుసారంగా ఎరువుల ధరలను పెంచకుండా కేంద్ర ప్రభుత్వం నియంత్రించాలి. లేకుంటే ఎరువుల ధరలు రైతులకు భారంగా మారతాయి. పెరుగుతున్న ధరలతో రైతాంగం వ్యవసాయం చేయడమే గగనంగా మారుతోంది. ధరలను నియంత్రించి రైతాంగాన్ని ఆదుకోవాలి.

పెరిగిన రసాయన ఎరువుల ధరల వివరాలు ఇలా..

ఎరువు రకం	పాత ధర రూ.	కొత్త ధర రూ.
14-35-14	1700	1800
20-20-0-13	1350	1450
10-26-26	1470	1800
16-20-0-13	1250	1300
15-15-15-15-9	1450	1600
12-32-16	1470	1720
16-16-16	1450	1600
24-24-0	1700	1800
12-32-16	1470	1720
సింగిల్‌సూపర్‌ఫాస్పెట్	580	640

వేలం ప్రకటన

మహారాజశ్రీ పర్చూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

EP No : 4/2024

in

O.S No : 62/2023

బొగ్గవరపు మహాలక్ష్మి ...... DHR

V/s

చప్పిడి అనసూర్యమ్మ వగైరాలు .....JDRs

పై నంబరు E.Pలోని DHRతనకు JDRs నుండి రావలసిన E.P.బాకీ మొత్తము ను రాబట్టు కొనుటకు ఈక్రింద ఉదహరించిన షెడ్యూలు ఆస్తిని వేలం వేయమని శ్రీకోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కనుక ఆసక్తి గల వారు ఎవరైననూ పైకోర్టులో ది :03-09-2025 ఉదయం 10:30 గంటలకు జరుగు వేలంపాటలో పాల్గొనవచ్చును. కోర్టు షరతుల ప్రకారంగా వేలం జరుపబడును.

షెడ్యూల్ :-

బాపట్ల జిల్లా (పాత ప్రకాశం జిల్లా), ఇంకొల్లు S.R.O, ఇంకొల్లు మండలం, ఇడుపులపాడు గ్రామ పంచాయతీలోని D.No:-163/16లో గల A.1-91 సెంట్లు భూమిలో ఎ.0-25 సెంట్లు ఖాళీ స్థలంనకు హద్దులు:-

తూర్పు :పుసులూరి చెన్నకేశవాచార్యులు వగైరాల భూమి.

దక్షిణం : అంబటి కాంతయ్య వగైరాల భూమి

పడమర :మద్దాల కిషోర్ కుమార్ యొక్క మిగులుభూమి

ఉత్తరం : సర్కారు డొంక

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో //

DHR విలువ : Rs.6,00,000/-

అమీనా విలువ : Rs.8,00,000/-

JDR s విలువ : ఇవ్వలేదు

వేలం తేది : 03-09-2025

ఫర్ధర్ హియరింగ్ : 10-09-2025

పర్చూరు

16-08-2025 ఇట్లు

యార్లగడ్డ వెంకటేశ్వరరావు

DHR తరుపు న్యాయవాది పర్చూరు

Cell No : 9985534996.

CHANGE OF NAME

I, CHANDALURI VENKATA SIVA MAHESWARI D/o.CHANDALURI KONDAIAH(Old Name) Resident of H.No.17-6-1/4, Ramamandiram Street, Bommalathota,Chirala,Bapatla District,A.P. I have changed my name/surname as KOTHA VENKATA SIVA NAGA MAHESWARI (New Name)W/o.KOTHA VENKATA MURALIDHAR Hence after my name/surname as KOTHA VENKATA SIVA NAGA MAHESWARI (New Name) W/o.KOTHA VENKATA MURALIDHAR

CHANGE OF NAME

I, THOLUPULURI VINITHA W/o. THOLUPULURI LEELA KUMAR(OLd Name) Resident of 39-4-14-2, Near Putta Tree, gopalnagar 1st Line, Ongole, Prakasam District, A.P, I have changed my name as THOLUPULURI VINEETHA W/o.THOLUPULURI LEELA KUMAR(New Name) Hence after my name is known as THOLUPULURI VINEETHA W/o.THOLUPULURI LEELA KUMAR(New Name)

పాస్ పోర్ట్ పోయినది

ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం సింగరాయకొండ గ్రామానికి చెందిన చెరుకు క్రాంతి రేఖ తండ్రి శ్రీనివాసరావు అను నాకు సంబంధించిన పాస్‌పోర్ట్ పోయినది. సింగరాయకొండలోని మా ఇంటినుంచి ఆర్టీసీ బస్టాండ్‌కు వెళుతుండగా నా పాస్‌పోర్ట్ పోయినది. ఆయొక్క పాస్‌పోర్ట్ నెంబర్ V4314361. గల పాస్‌పోర్ట్ పోయినది దొరికిన వారు ఈకింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

ఇట్లు.

చెరుకు క్రాంతి రేఖ

తండ్రి శ్రీనివాసరావు

స్టాలిన్ నగర్

సింగరాయకొండ, ప్రకాశంజిల్లా

సెల్ : 7036306965

జనరల్ నోటీసు ప్రకటన

మహారాజశ్రీ రేపల్లె సీనియర్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

క్రెడిటర్ ఐ.పి.నెం.9/2025

బిట్వీన్

కొనకాల అజయకుమార్ ......పిటీషనరు.

ఎదిరి

1.బొర్రు శ్రీనివాసరావు

2.బొర్రు రామలక్ష్మి

3.బొర్రు వాత్సల్య ....రెస్పాండెంట్స్.

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా పైన పేర్కొన్న కోర్టులో పిటీషనర్ అయిన కొనకాల అజయ కుమార్ గారు పై రెస్పాండెంట్స్ పై దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిపై క్రెడిటర్ ఐ.పి. దాఖలు చేసియున్నారు. దర్శిలా కోర్టువారు జనరల్ నోటీసు నిమిత్తం పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ఆర్డరు చేసియున్నారు.

షెడ్యూలు

బాపట్ల జిల్లా, చెరుకుపల్లి సబ్ డి.యిలాకా చెరుకుపల్లి మండలం, ఆరుంబాక శివారు, గుళ్ళపల్లి గ్రామ పంచాయతీలో చేరిన ఆరుంబాక గ్రామ డి.నెం.307/5 రులో 377 చ.గ.లు నివేశన స్థలము, అందలి పాత డోరు నెం.1-267/2, అసిస్మెంట్ నెం. 1193, క్రొత్త డోరు నెం.2-154/1, అసిస్మెంట్ నెం. 1704 ర్లు గల బిల్డింగ్ కు హద్దులు:-

తూర్పు :పంచాయతీ బజారు హద్దు - 51 అ.లు

దక్షిణం :అద్దంకి రమేష్ బాబుగారి ఆస్తిహద్దు-66అ.లు

పడమర :దాసరి బాలకృష్ణగారి ఆస్తి హద్దు- 51 అ.లు

ఉత్తరం : ఈపూరు పద్మగారి కుటుంబీకులు మరియు ఉమ్మనేని రామయ్యగార్ల ఆస్తి హద్దు - 67 అ.లు

సదరు పై షెడ్యూలు దాఖలా ఆస్తి విషయమై ఎవ్వరికైననూ ఎటువంటి అభ్యంతరములు ఉన్న యెడల ది.02-09-2025వ తేదీన ఉదయం గం. 10.30 ని.లకు పై కోర్టువారి ఎదుట ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేనియెడల మీపరోక్షమున తీర్మానించబడునని యిందుమూలముగా యావన్మంది కి తెలియజేయుటమైనది.

వాయిదా తేది : 02-09-2025

// శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు

బొమ్మిడి అంతిరాజులు,

పిటీషనరు తరుపు న్యాయవాది,

రేపల్లె.

సెల్ నెంబర్ 9849327734

పెండింగ్ కేసులపై దృష్టి సారించాలి

మద్దిపాడు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ ఏఆర్ దామోదర్

ప్రజాశక్తి-మద్దిపాడు

పెండింగ్ కేసులపై దృష్టి సారించి త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. పోలీస్ స్టేషన్ స్థితిగతులు, సిబ్బంది పని తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించడానికి మద్దిపాడు పోలీస్ స్టేషన్‌ను ఆదివారం జిల్లా ఎస్పీ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో భాగంగా స్టేషన్ పరిసరాలు, వివిధ గదులు, విధుల్లో ఉన్న సిబ్బంది పనితీరు, డ్యూటీల కేటాయింపు, రిసెప్షన్ కౌంటర్ నిర్వహణ, ఫిర్యాదుల స్వీకరణ విధానం, మహిళా సహాయక కేంద్రం, రికార్డ్స్, సీడీ ఫైల్స్ తదితర అంశాలను సమీక్షించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో లా అండ్ ఆర్డర్, నేర నివారణ వ్యూహాలపై తీసుకుంటున్న చర్యలపై అధికారులను ఆరా తీసి పలు సూచనలు చేసారు. 174 సి ఆర్ పిసి, మిస్సింగ్ కేసులు, పాత పెండింగ్ కేసులలో విచారణ త్వరగతిన పూర్తి చేయాలని, కేసుల విచారణకు చేపట్టవలసిన విధానం గురించి దిశానిర్దేశం చేశారు. గ్రేవ్ కేసులలో త్వరగా దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేసి, తగిన సాక్షాదారాలతో ముద్దాయిలకు శిక్ష పడే విధంగా చేయాలన్నారు. కేసుల పరిష్కారంలో జాప్యం వహించే కొలది బాధితులకు సత్వర న్యాయం అందించలేమని దానికి అనుగుణంగా పోలీస్ స్టేషన్ నిర్వహణ ఉండాలని సూచనలు చేశారు. నేరాలు కట్టడికి గస్తీ ముమ్మురం చేయాలని, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా నిరంతర గస్తీ నిర్వహించేటట్లు, నైట్ బీట్ డ్యూటీ చేస్తున్న సిబ్బందిని తరచూ అప్రమత్తంగా చెయ్యాలని, డయల్-112 ఫిర్యాదులు రాగానే వెంటనే స్టేషన్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య ను పరిష్కరించేటట్లు చూడాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు మరింత ముందస్తు చర్యలు తీసుకోవాలని, విరివిగా విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని, స్టేషన్ లో వివిధ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, విధుల పట్ల అంకితభావంగా ఉంటూ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజలకు సిసి కెమెరాల పట్ల అవగాహన కల్పించి వాటి ప్రాముఖ్యతను వివరిస్తూ ఇంకా కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విస్తృతంగా స్కూల్/కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలని, గంజాయి వంటి మాదక ద్రవ్యాలు సేవించడం వల్ల కలిగే దుష్ప్రభావాలు, చట్టపరమైన చర్యల గురించి, సైబర్ నేరాలపై ప్రజలు మరియు విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేయుటకు వచ్చే ఫిర్యాదులుదారుల పట్ల, మర్యాదపూర్వకంగా మాట్లాడి వారి సమస్య తెలుసుకొని వెంటనే విచారణ చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు ఎస్పీ సూచించారు. జిల్లా ఎస్పీ వెంట ఒంగోలు డిఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఒంగోలు రూరల్ సీఐ యన్. శ్రీకాంత్ బాబు, మద్దిపాడు ఎస్సై బి. శివరామయ్య, సిబ్బంది ఉన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

సిఐటియు మండల కమిటీ కన్వీనర్‌గా రాయళ్ల మాలకొండయ్య

ప్రజాశక్తి-వెలిగండ్ల

వెలిగండ్ల మండల సిఐటియు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. కమిటీ కన్వీనర్‌గా రాయల మాలకొండయ్య, కో కన్వీనర్‌గా కుమ్మరి కుంట ఎస్తేరమ్మ, కమిటీ సభ్యులుగా తాతపూడి జయప్రమీళ, మునులపాటి పార్వతి, రెడ్డెం తిరుపతమ్మ, బొప్పరాజు నాగలక్ష్మి, మల్లెల రాణి, జొన్నలగడ్డ హేమేలమ్మ, వై రమణ, కాకర్ల నాగేశ్వరి, సోమన బోయిన రమణమ్మ, బొప్పరాజు అనంతలక్ష్మి, పోలిబోయిన నాగలక్ష్మి, కుమ్మరి కుంట విశ్రాంతమ్మ, ఈర్ల గురవమ్మ, బొందలపాటి గోపాల్‌లను ఎన్నుకున్నారు.

మాలకొండయ్య, ఎస్తేరమ్మ

'చలో కరేడు'ను భగ్నం చేసే యత్నాలు..?

శింగరాయకొండ చుట్టూ ఉలవపాడు పోలీసులు -ప్రజాసంఘాల కార్యాలయాలపై నిఘా

ప్రజాశక్తి-శింగరాయకొండ

నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం కరేడులో బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా ఈనెల 18వ తేదీన రైతు సంఘాల సమన్వయ కమిటీ చలో కరేడు కార్యక్రమాన్ని పోలీసులు పట్నం చేసేందుకు తీవ్ర ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు ఉలవపాడు పోలీసులు శింగరాయకొండలో తిష్ట వేశారు. శింగరాయకొండలోని దాచూరి రామిరెడ్డి అనసూర్యమ్మ ప్రజాసంఘాల భవనం వద్ద పోలీసులు సాధారణమైన దుస్తుల్లో ఉండి, ఎవరు వస్తున్నారని అంశంపై పరిశీలిస్తున్నారు. ఉలవపాడు ఎస్సై అంకమ్మ సైతం శింగరాయకొండలో ఓ ప్రైవేటు వాహనంలో తిరుగుతూ ప్రజాసంఘాల కార్యాలయంతో పాటు శింగరాయకొండ నుంచి ఉలవపాడు వెళ్లే జాతీయ రహదారిపై పూర్తిస్థాయి నిఘా పెట్టారు. అటు నెల్లూరు జిల్లా కందుకూరు ప్రాంతం నుంచి ఇటు ప్రకాశం జిల్లా నుంచి ఎవరైనా కరేడు ప్రాంతానికి వస్తున్నారేమోనని పూర్తిస్థాయి నిఘా ఏర్పాటు చేశారు. శింగరాయకొండలో కందుకూరు ప్రాంతానికి చెందిన రైతు సంఘాలు ప్రజాసంఘాల నాయకులను కొందరిని అదుపులోకి తీసుకొని రహస్యంగా ఉంచారు.

రామతీర్థం రిజర్వాయర్‌లో పూర్తిస్థాయిలో నీటిమట్టం

నిండుకుండలా 'రామతీర్థం'

ప్రజాశక్తి-చీమకుర్తి

రామతీర్థం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిండుకుండలా ఉంది. పూర్తిస్థాయికి అతి చేరువగా నీరు చేరడంతో క్రిందికి అధికారులు నీటిని విడుదల చేశారు. ఆదివారం సాయంత్రానికి 85 మీటర్ల నీటిమట్టం నమోదయింది. పూర్తిస్థాయి 85.34 కాగా 85 మీటర్లకు నీటిమట్టం చేరింది. రిజర్వాయర్ నుంచి కిందికి 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కారుమంచి మేజర్, త్రోవగుంట మేజర్ లాంటి సాగర్ కాలువలకు నీరు వదిలారు. దీంతో రైతులు వరి సాగుకు నారు పోయడానికి సమాయత్తమవుతున్నారు. చీమకుర్తి వన్, చీమకుర్తి టు చెరువులకు నీటిని నింపుతున్నారు. మండలంలో ఆయా కాలువల కింద ఉన్న అవసరమైన చెరువులకు నీటి నిలుపుకోవడానికి అవకాశం ఏర్పడింది. రైతులు ఇంకా వ్యవసాయ పనులు మొదలు కాకపోవటంతో తాత్కాలికంగా 150 క్యూసెక్కులను కిందికి వదులుతున్నారు. పూర్తిస్థాయిలో వ్యవసాయ పనులు ప్రారంభమైతే నీటిని కూడా పూర్తిస్థాయిలో వదలాలని అధికారులు భావిస్తున్నారు. ఈ పాటికి సాగర్ కాలువలపై జంగిల్ క్లియరెన్స్ మరియు స్కిల్ టు తీస్తున్నారు. దీనితోడు అల్పపీడ ప్రభావంతో వర్షాలు పడుతుండటంతో, ఇటు సాగర్ నీరు అందుబాటులో ఉండటంతో రైతులు వరి నార్లు పోయడానికి సిద్ధపడ్డారు. ఆదివారం సాయంత్రానికి 670 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌లోకి వస్తుంది.

బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

'ఉచిత బస్సు'తో పెరిగిన రద్దీ

ప్రజాశక్తి-పామూరు

ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయడంతో బస్సుల్లో రద్దీ పెరిగింది. శనివారం, ఆదివారం పామూరు బస్టాండ్ నుంచి నెల్లూరు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సుల్లో రద్దీ పెరిగింది. గతంలో పామూరు నుంచి దుత్తలూరు వరకు ఆటోలో ప్రయాణం చేసేవారు. బస్సు కోసం ఎదురు చూడకుండా దగ్గర గ్రామాల్లో ప్రయాణం చేస్తున్నారు. రెండు రోజుల నుంచి మహిళలు ఆటో ఎక్కకుండా బస్సు కోసం ఎదురుచూస్తూ, వచ్చిన బస్సు ఎక్కడంతో ఆటో ఎక్కడం లేదని గిరాకీ తగ్గిందని ఆటో కార్మికులు లబోదిబో అంటున్నారు. పామూరు నుంచి సిఎస్‌పురం వెళ్లేందుకు బస్సులు లేవని అటువైపు బస్సులు వేయాలని దోబగుంట్ల, బుక్కాపురం, కంభంపాడు, ప్రాంత ప్రజలు కోరుతున్నారు. బస్సు వచ్చిన వెంటనే ప్రయాణికులు ఎక్కేందుకు తొక్కిసలాటలో ఎలాంటి ప్రమాదం జరుగుదని చుట్టూ ఉన్న దుకాణ యజమానులు భయపడుతున్నారు.

శింగరాయకొండ : శింగరాయకొండ ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం నాడు బస్సులన్నీ రద్దీగానే కనిపించాయి. ఓ పక్క వివాహాలు కొలుపులతో జనం కార్యక్రమాల్లో నిమగ్నమై ఉన్న సమయంలో మరో పక్క మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం ఉండడంతో ఆర్టీసీ బస్టాండ్ వద్ద పల్లె వెలుగులు బస్సులకు జనం రద్దీ పెరిగిపోయింది. కావలి, కందుకూరు ప్రాంతాల నుంచి ఒంగోలుకి వెళ్లే బస్సులు జనం రద్దీతో నిండిపోయి ఉన్నారు. ఆర్టీసీ బస్టాండ్‌కు పూర్తిస్థాయిలో బస్సులు రాకపోవడంతో ఉన్న బస్సులతో జనం బస్టాండ్‌లో ఎదురుచూసి బస్సు ఎక్కాల్సిన పరిస్థితి నెలకొంది.

కొండపి బస్టాండులో వసతులు కల్పిస్తాం

ప్రజాశక్తి-కొండపి

కొండపి బస్టాండ్‌కు త్వరలో అన్ని వసతులు కల్పిస్తామని రీజినల్ మేనేజర్ జి.సత్యనారాయణ తెలిపారు. ఆదివారం ఉదయం కొండపి బస్టాండు పరిసరాలను పరిశీలించి స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై మహిళా ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండపి ఆర్టీసి బస్టాండ్‌లో కనీస వసతులు కరువు అయ్యాయని వాటిని వెంటనే పరిష్కరిస్తామని అన్నారు. ఆర్టీసి బస్టాండ్‌లో ఫ్యాన్లు లేవని ఫిర్యాదులు అందాయని, మంగళవారం నుంచి ఫ్యాన్లు అందుబాటులోనికి రానున్నాయని తెలిపారు. త్వరలోనే బస్టాండ్ పరిసరాలలో మంచినీటి సౌకర్యాలను ప్రయాణికులకు కల్పిస్తామన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకొని వస్తే వెంటనే సమస్యలను పరిష్కరించి వసతులను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కొండపి నుంచి కనిగిరికి నేరుగా బస్సును ఏర్పాటు చేయాలని ప్రయాణికులు అడగగా సాధ్య సాధ్యలపై ఆలోచించి నిర్ణయం తీసుకుంటానని ప్రయాణికులకు తెలిపారు. మహిళలకు ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత బస్సులో ప్రస్తుతానికి గుర్తింపు కార్డులు లేకుండా ఉచిత ప్రయాణాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. మహిళలు బస్సులలో ఉచితంగా ప్రయాణించాలి అంటే తమతో పాటు ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, ఇతర గుర్తింపు కార్డులో ఏదో ఒకదానిని తమతోటి తీసుకొని రావాలని ప్రయాణికులకు అవగాహన కల్పించారు. మహిళలు ట్రాన్స్‌జెండర్లు ఉచిత బస్సు ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శనివారం జిల్లాలో 57 వేల మంది మహిళ ప్రయాణికులు ఉచిత బస్సు ప్రయాణాన్ని చేశారని దాని రాయితీ 25 లక్షల వరకు ఉందని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణానిపై మహిళలకు ట్రాన్స్‌జెండర్‌లకు అవగాహన కల్పిస్తున్నామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రయాణికులను కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కె.వి.రావు, ఏడుకొండలు, మహిళా ప్రయాణికులు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఆర్ఎం

సర్పంచి శిల్పా సౌందర్యకు స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

సర్పంచి శిల్పా సౌందర్యకు ఘన స్వాగతం

ప్రజాశక్తి-మద్దిపాడు : ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు హాజరై తిరిగి స్వగ్రామానికి వచ్చిన ఏడుగుండ్లపాడు సర్పంచ్ శిల్పా సౌందర్యకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ మేరకు ఆదివారం గ్రామంలోని బస్టాండ్ సెంటర్ నుంచి పంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సర్పంచ్ శిల్పా సౌందర్యను మాజీ సర్పంచ్, పెద్దకొత్తపల్లి సొసైటీ చైర్మన్ మండవ హరిప్రసాద్ అభినందించి శాలువాతో సత్కరించారు. శిల్పా సౌందర్యను ప్రత్యేకంగా అభినందించారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఆమె ప్రత్యక్షంగా వీక్షించి అక్కడ జరిగిన విశేషాలను తను పొందిన అనుభూతిని గ్రామస్తులతో పంచుకున్నారు. ఇలాంటి అవకాశం తనకు వచ్చినందుకు ఎంతో ఆనందంగా ఉందని సర్పంచ్ తెలిపారు. అనంతరం పలువురు సర్పంచ్‌కు పుష్పగుచ్చాలు అందజేసి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దాసరి రమేష్, గ్రామస్తులు సామ్యూల్, దేవదాసు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని గేదెలు మృతి

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు : ఆటో ఢీకొని రెండు గేదెలు మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి ఉప్పుగుండూరు నాగన్నవాగు చెక్ డ్యాం సమీపంలో జరిగింది. వివరాల మేరకు బాపట్ల జిల్లా పెదగంజాంకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన వారు ట్రాలీ ఆటోలో కామేపల్లి గుడికి వెళ్ళి తిరిగి స్వగ్రామానికి వెళుచుండగా ఉప్పుగుండూరు నాగన్నవాగు చెక్ డ్యాం వద్దకు వచ్చేసరికి ఒక్కసారిగా చీకట్లో గేదలు ఎదురురావడంతో కనిపించక ఆటో ఢీకొట్టింది. దాంతో రెండు గేదెలు అక్కడిక్కడే మృతి చెందాయి. వాటి విలువ 2 లక్షలు వరకు ఉంటుంది.

మొక్కలు నాటుతున్న రోటరీ ప్రతినిధులు

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

ప్రజాశక్తి - పర్చూరు

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని రోటరీ అధ్యక్షులు తోకల కృష్ణమోహన్ కోరారు. మండలంలోని నాగులపాలెం బధిరుల పాఠశాల పరిసర ప్రాంతాల్లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో వర్షాలు కురవడానికి మొక్కలు భూమిపై ప్రధాన భూమిక వహిస్తాయని తెలిపారు. పర్యావరణాన్ని కాపాడతా యని అన్నారు. మానవులకు స్వచ్ఛమైన ప్రాణవాయువు అందిస్తాయని చెప్పారు. భూమి మీద మానవాళికి, భావితరాలకు ఎంతో ఉపయోగమని పేర్కొన్నారు. నాటిన మొక్కలు సంరక్షణ కోసం విద్యార్థులకు దత్తత ఇచ్చారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి కె ఆంజనేయులు, అసిస్టెంట్ గవర్నర్ నాగబైరు శ్రీనివాసరావు, కోట శ్రీనివాసరావు, నాగుబడి సుబ్బారావు, కొల్లా సుబ్బారావు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఎఒ ఎ మహేష్

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

ప్రజాశక్తి - రేపల్లె

రైతులను మోసగించి అధిక ధరకు ఎరువులు అమ్మితే చర్యలు తీసుకుంటామని ఎఒ ఎ మహేష్ హెచ్చరించారు. రేపల్లె ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం, ప్రైవేటు ఎరువుల దుకాణాల్లో ఆయన ఆదివారం తనిఖీలు నిర్వహించారు. స్టాక్ వివరాలు, అనుమతి పత్రాలు, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రైవేటు, సొసైటీలు అన్నిటిలో కలిపి 378 టన్నుల యూరియ, 220 టన్నుల డిఎపి, కాంప్లెక్స్ 320 టన్నులు ఉన్నాయని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రైతులు మోతాదుకు మించి ఎరువులు ఉపయోగించరాదని చెప్పారు. అలా ఉపయోగిస్తే పంట దిగుబడి తగ్గిపోతుందన్నారు. రైతులకు త్వరలో రైతు సేవ కేంద్రాలలో ఎరువులు ఉంచుతామని తెలిపారు. ఎంఆర్‌పి ధరలకు ఎరువులు అమ్మాలని, అదనంగా ధరలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న రోటరీ ప్రతినిధులు

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణం లోని మొండితోకపాలెంకు చెందిన పేద కుటుంబం బండారు కుమార్, పద్మ కుమార్తె శివాని వివాహ ఖర్చుల నిమిత్తం రోటరీ క్లబ్‌ను సంప్రదించారు. రోటరీ కార్యాలయంలో బండారు శివాని వివాహ ఖర్చుల నిమిత్తం రూ.5వేలు రోటరీ ప్రతినిధులు ఆదివారం సహాయం చేశారు. పేదలకు సహాయం చేయడంలో రోటరీ క్లబ్ ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చప్పిడి వీరయ్య, తమ్మన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి - వేటపాలెం

బహుమతులు అందజేస్తున్న ఎంఎల్ఎ కొండయ్య

క్రికెట్ క్రీడలో మంచి గుర్తింపు వచ్చే విధంగా కృషి చేయాలని శాసన సభ్యులు కొండయ్య అన్నారు. మండలంలోని చల్లారెడ్డి పాలెం డిగ్రీ కాలేజ్ మైదానంలో రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతులు ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్నేహ పూర్వకమైన వాతావరణంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం సంతోషదాయ కమని అన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని క్రీడా పోటీలు నిర్వహించాలని అన్నారు. విజేతలకు ఫస్ట్ ప్రైజ్ కే పూర్ణ రూ.50వేలు, సెకండ్ ప్రైజ్ గొల్లపూడి కృష్ణ రూ.30వేలు, తృతీయ బహుమతి పందిళ్ళపల్లి శేఖర్ రూ.20వేలు, థర్డ్ ప్రైజ్ పులి హరికృష్ణ రూ.10వేలు, బెస్ట్ బౌలర్, బెస్ట్ ఫీల్డర్, బెస్ట్ బ్యాట్స్మెన్‌లకు దోగుపర్తి బాలకృష్ణ రూ.15వేలు అందజేశారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ కవితవరపు జనార్ధనరావు, టిడిపి నాయకులు కీర్తి పూర్ణచంద్రరావు, యువజన నాయకులు కొత్త నాగు, వైస్ ప్రెసిడెంట్ గోవిందుల శ్రీకాంత్, ఉమ్మిటి శంకర్రావు, షేక్ లాల్ అహ్మద్, దోగుపర్తి బాలకృష్ణ, పోలకం చంద్రశేఖర్, గొల్లప్రోలు కృష్ణ, పృధ్వి బాలచంద్ర మూర్తి పాల్గొన్నారు.

ఉచిత ప్రయాణానికి బస్సులు పెంచాలి

ఐద్వా జిల్లా నాయకురాలు సుభాషిణి డిమాండ్

ప్రజాశక్తి - బాపట్ల

ఐద్వా నాయకురాలు సుభాషిణి

ప్రభుత్వం ప్రకటించిన మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి బస్సుల సంఖ్య పెంచాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా నాయకురాలు టి సుభాషిణి డిమాండ్ చేశారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య ప్రజా సంఘాల జిల్లా కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వం మహిళలకు ఉచితంగా బస్సుల్లో ప్రయాణించేందుకు అనుమతించారే గాని అందుకు తగ్గట్టు బస్సుల సంఖ్య పెంచలేదని అన్నారు. దీంతో జిల్లాలో పలుచోట్ల బస్టాండుల్లో మహిళా ప్రయాణికుల రద్దీ పెరుగుతోందని అన్నారు. జిల్లా కేంద్రమైన బాపట్ల పరిసర గ్రామీణ ప్రాంతాల నుండి బాపట్లకు వచ్చి ఇతర ప్రాంతాకు ఆర్టీసి బస్సులో ప్రయాణాలు కొనసాగిస్తుంటారని అన్నారు. పాత బస్టాండ్ వద్ద మహిళా ప్రయాణికులతో ఆదివారం కిక్కిరిసి పోయిందని అన్నారు. వేమూరు నుండి నేరుగా బాపట్లకు బస్ సౌకర్యం లేదు. బస్సులు లేని ప్రాంతాలకు బస్సులు తిప్పడంతో పాటు ప్రస్తుతం తిరుగుతున్న రేపల్లె, అద్దంకి, చీరాల, పొన్నూరు, గుంటూరు, విజయవాడ ప్రాంతాలకు మరిన్ని బస్సు సర్వీసులు పెంచాలని కోరారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని మరిన్ని బస్సులు పెంచాలని సుభాషిణి కోరారు.

నదీ పరివాహక ప్రాంతంలో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - రేపల్లె

మాట్లాడుతున్న తహశీల్దారు శ్రీనివాసరావు

వర్షాలు విస్తారంగా కురవడంతో కృష్ణా నది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దారు మోర్ల శ్రీనివాసరావు కోరారు. పెనుమూడి వారధి వద్ద కృష్ణా నదిని ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విస్తారంగా వర్షాలు కురవడంతో నది తీవ్రత ఎప్పుడు పెరుగుతుందో తెలియదని అన్నారు. నది పరివాహక ప్రాంతాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నదిలో ప్రజలు, రైతులు దిగవద్దని కోరారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. ఎటువంటి ఆస్తి, పశు, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. పంచాయతీ పరిధిలోని వివిధ శాఖల అధికారుల అందుబాటులో ఉండి ప్రజలకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని చెప్పారు. కృష్ణ నది వరద ఉధృతిపై ప్రజలకు ఎప్పటి కప్పుడు సమాచారమిస్తూ ప్రజలను అప్రమత్తం చెయ్యాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి లోతట్టు ప్రభావిత ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు నిరంజన్ బాబు, ఆర్ఐ రాంబాబు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జిఎంపిఎస్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - మార్టూరు

మాట్లాడుతున్న తోట తిరుపతిరావు

ఎపి గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం రాష్ట్ర మహాసభలు ఈనెల 26 27తేదీల్లో ఒంగోలులో జరుగుతాయని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంటా శ్రీరామ్, సహాయ కార్యదర్శి తోటా తిరుపతిరావు ఆదివారం తెలిపారు. మండలంలోని జొన్నతాళి, ద్వారకపాడు, వరపర్ల గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. గ్రూప్ మీటింగులు నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదు కోట్లకు పైగా గొర్రెలు, మేకలు ఉన్నాయని, వాటి ద్వారా ప్రభుత్వానికి రూ.16వేల కోట్ల ఆదాయం వస్తున్నదని తెలిపారు. వాటి సంరక్షణ, పెంపకం దారుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం అధ్యక్షులు సంపత్ నాగరాజు, గొల్ల పేరయ్య, గోరంట్ల బాలకోటయ్య, గోరంట్ల ఆంజనేయులు, చట్టి సాంబశివరావు, గోరంట్ల పెద్ద ఎలమంద, చట్టి పెద్దిరాజు, ఎస్ చగలయ్య, ఎస్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాత బస్టాండులో బస్సుల కోసం వేచి ఉన్న మహిళలు

ఉచిత బస్సుల కోసం రద్దీ

ప్రజాశక్తి - బాపట్ల

ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వ సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించిన రెండు రోజులకే మహిళా ప్రయాణికుల రద్దీ పెరిగింది. బస్సు కోసం ఎదురుచూస్తున్న మహిళతో స్థానిక పాత బస్టాండ్ ప్రాంగణం ఆదివారం మహిళలతో నిండిపోయింది. ఉచిత బస్సు ప్రయాణానికి మహిళలు ఎగబడుతున్న నేపథ్యంలో రానున్న రోజుల్లో మహిళలతో బస్సు ప్రయాణం ఎలా ఉంటుందోనని సీజనల్ ప్రయాణికుల్లో చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో ఎక్కడికైనా ఆర్డినరీ, ఎక్స్ ప్రెస్ బస్సు సర్వీసుల్లో ఉచిత ప్రయాణానికి అనుమతించ డంతో ఎక్స్ ప్రెస్ బస్సుల్లో ప్రయాణించేందుకే మహిళలు మొగ్గు చూపుతున్నారు. ప్రధాన రహదారుల్లో ఆర్డినరీ సర్వీసులు ఆగే ఊళ్ళకు మాత్రం ఆయా ప్రాంత మహిళా ప్రయాణికులు ఆర్డినరీ బస్సులోనే ప్రయాణి స్తున్నారు. గుంటూరు, విజయవాడ ఆపై ప్రాంతాలకు వెళ్లే మహిళా ప్రయాణికులు మాత్రం ఎక్స్ ప్రెస్ బస్సుల్లో ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. దీంతో ఎక్స్ ప్రెస్ బస్సులు మహిళా ప్రయాణికులతో నిండిపోతున్నాయి. దీంతో సీజనల్ టికెట్లపై ప్రయాణం చేసే ప్రయాణికులు కొంతమేర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

రైల్వే ప్లాట్ ఫాంపై విహరిస్తున్న వీధి కుక్కలు

రైల్వే ప్లాట్‌ఫాంపై కుక్కల స్వైరవిహారం

ప్రజాశక్తి - చీరాల

రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు కుక్కలు నరకం చూపిస్తున్నాయి. ప్లాట్‌ఫాంపై కుక్కలు గుంపులుగా తిరుగుతూ రైలు ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ప్రయాణికులు భయంతో వణికి పోతున్నారు. స్టేషన్‌కు వెనుక వైపున ఉన్న 2వ టిక్కెట్ కౌంటర్ వద్ద కుక్కలు అక్కడే బస చేస్తూ రాత్రి వేళలో ప్రజలపై విరుచుకు పడుతున్నాయి. కుక్కల దాటికి ప్లాట్‌ఫాంపై వెళ్లాలంటేనే భయపడి దూరంగా ఉంటూ భయంతో వణికిపోతున్నారు. సాధారణంగా ప్రయాణికులతో రద్దీగా ఉండే రైల్వే ప్లాట్‌ఫాం ప్రస్తుతం ఖాళీగా దర్శనమిస్తోంది. రైలు దిగిన తర్వాత ఎటు చూసినా కుక్కలు గుంపులుగా వెంటాడటంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్లాట్‌ఫాంపై ఎవరూ లేని సమయాల్లో కుక్కలు దారి కాచి, అటుగా వెళ్లేవారిపై మొరుగుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. రైళ్ల కోసం వేచి చూసేవారిని మరింతగా భయపెడుతున్నాయి.

వాకింగ్ కోసం వచ్చేవాళ్లు హడల్

ప్లాట్‌ఫారంపై ఆహ్లాదంగా ఉంటుందనే ఆలోచనతో ఉదయం, సాయంత్రం వాకింగ్ కోసం వచ్చే వాళ్లు సైతం ప్లాట్‌ఫారంపై కుక్కల గుంపులను చూసి నడక తర్వాత ప్రమాదం జరగకుండా ఉంటే చాలని వెనక్కి వెళుతున్నారు. నిత్యం జనంతో రద్దీగా ఉండే రైల్వే ప్లాట్‌ఫారంపై పదుల సంఖ్యలో కుక్కల గుంపు ప్రజలను భయభ్రాం తులను చేస్తున్నాయి.

అధికారుల నిర్లక్ష్యమే కారణమా?

రైల్వే అధికారులు నిత్యం ప్లాట్‌ఫాంపై గమనిస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదు. ఈ సమస్యపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. గతంలో ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా, అధికారులు దీనిపై దృష్టి సారించడం లేదని ప్రయాణికులు అంటున్నారు. ఫలితంగా కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతోందని వాపోతున్నారు. తక్షణమే ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణం కల్పించాలని కోరుతున్నారు. రైల్వే అధికారులు స్పందించకపోతే, ఈ సమస్య మరిన్ని ప్రమాదాలకు దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ఆల్ ఇండియా రోడ్ ట్రాన్‌ఫోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఈ నెల 24 న ఒంగోలులో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా రోడ్ ట్రాన్‌ఫోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర మూడవ మహాసభలనుజయప్రదం చేయాలని ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. శ్రీనివాసులు కోరారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆల్ ఇండియా రోడ్ ట్రాన్‌ఫోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర మహాసభలు ఒంగోలు నిర్వహించడం చాలా సంతోషకరమన్నారు. ఒంగోలు కేంద్రంగా రవాణా రంగంలో పనిచేస్తున్న ప్రైవేట్ బస్సు ఆపరేటర్లు, డ్రైవర్లు వారు ఎదుర్కొటున్న సమస్యలపై 1975, 1980, 1983 ప్రాంతాల్లో సిఐటియు సారథ్యంలో అనేక ఉద్యమాలు చేపట్టి ఘన విజయం సాధించిన నేపథ్యాన్ని ఈ సందర్భంగా ఉటంకించారు. 1983 - 1985 మధ్యకాలంలో శింగరాయకొండ కేంద్రంగా 2000 లారీలపై ఆధారపడి పనిచేసే సుమారు 4 వేలమంది డ్రైవర్లు, ఆపరేటర్లు సమస్యలపై పోరాటం చేపట్టి విజయం సాధించిన వైనాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ రెండు ఘటనలు ప్రకాశం జిల్లాలో రవాణా రంగం అభివద్ధి చెందడానికి, విస్తరించడానికి బాగా దోహదపడినటు తెలిపారు. ఈ ఉద్యమాల స్ఫూర్తి ఆర్‌టిసి డిపోలో స్టాప్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏర్పాటుకు పునాదులు ఏర్పడినట్లు తెలిపారు. ఒంగోలు నగరంలో పర్మినెంట్ ఆటో స్టాండ్ కోసం ఆర్‌టిఏ అధికారులు, పోలీసు అధికారుల వేధింపులకు వ్యతిరేకంగా వేలాది మంది ఉద్యమం నిర్వహించిన అంశాన్ని గుర్తు చేశారు. ఇన్ని పోరాటాల ఫలితంగా ప్రకాశం జిల్లాలో రవాణారంగం వేగంగా అభివద్ధి చెందిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రవాణా రంగంలో పని చేసే కార్మికుల పట్ల చాలా చిన్న చూపు చూస్తున్న పరిస్థితి ఏర్పడినట్లు తెలిపారు. ఆ రంగంలో పనిచేసే ఆపరేటర్లు, డ్రైవర్లపై రక రకాల పేరుతో వేధింపులకు గురి చేస్తున్నట్లు ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 21 పేరుతో జరిమానాలు విధించడం, పెనాల్టీలు పెంచడం లాంటి చర్యలకు పాల్పడుతున్నట్లు దుయ్యబట్టారు. ఈ జీవో కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున జిల్లాలో ఉద్యమం చేపట్టిన అంశాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం నూతన మోటార్ వెహికల్ చట్టం , బిఎన్ఎస్ చట్టం పేరుతో రవాణా రంగ కార్మికుల్ని మరింత కుంగదీస్తుందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం చేసిన గ్రీన్ టాక్స్ రద్దు లారీ ఆపరేటర్లకు ఉపకరించినప్పటికి, ఆటో, కార్లు, ఇతర ట్రక్కుల డ్రైవర్లు, ఆపరేటర్ల సమస్యలు అలాగే ఉన్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఒంగోలు నగరంలో మహాసభలు నిర్వహించతల పెట్టామన్నారు. 24వ తేదీ ఒంగోలు కాపు కళ్యాణ మండపంలో ఉదయం ఎనిమిది గంటలకు మహాసభలు ప్రారంభమవ ుతాయన్నారు. ఈ మహాసభల్లో రవాణా రంగం ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి జనాబ్దేవ్, ఆల్ ఇండియా ఉపాధ్యక్షుడు ఆర్. లక్ష్మయ్య , రాష్ట్ర అధ్యక్షులు అధ్యక్షుడు ఎన్.శివాజీ , ముజఫర్ అహ్మద్ , కె.దుర్గారావు, సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, నాయకులు ఎం.రమేష్ , జివి.కొండారెడ్డి, పి.కల్పన , చీకటి శ్రీనివాసరావు ,తంబి శ్రీనివాసులు , టి.మహేష్ పాల్గొంటారన్నారు. మహాసభలో రవాణా రంగ కార్మికుల సమస్యలను చర్చించి రాబోయే రోజుల్లో పోరాట కార్యక్రమం తీసుకోవడానికి మహాసభలు వేదిక అవుతాయన్నారు. జిల్లాలోని అభ్యుదయ వాదులు, రాజకీయ నాయకులు, అన్నివర్గాల ప్రజలందరూ మహాసభలకు సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు , రవాణా రంగ నగర కార్యదర్శి తంబి శ్రీనివాసులు, ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా కార్యదర్శి దాసరి మల్లికార్జునరావు , ఆహ్వాన సంఘం నాయకులు మున్వర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జి. శ్రీనివాసులు

ఒంగోలులో ఆలిండియా కరాటే పోటీలు అభినందనీయం

- దామచర్ల జనార్ధన్‌రావు

- విజేతలకు అభినందనలు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలులో ఆలిండియా కరాటే ఛాంపియన్‌షిప్ నిర్వహించటం అభినందనీయమని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు పేర్కొన్నారు. ఒంగోలు మినీ స్టేడియంలో ఆలిండియా ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్-2025 ముగింపు వేడుకలు ఆదివారం నిర్వహించారు. తొలుత ఆలిండియా ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్-2025ను జిల్లా ఎస్‌పి దామోదర్ లాంఛనంగా ప్రారంభించారు. కరాటే ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్న క్రీడాకారులకు ఎస్‌పి అభినందనలు తెలియజేశారు. సాయంత్రం నిర్వహించిన ముగింపు వేడుకలకు కరాటే అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లూరి మోహనరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు మాట్లాడుతూ ఆలిండియా ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్-2025 పోటీలలో 7 రాష్ట్రాల నుంచి 700 మంది క్రీడాకారులు, కోచ్‌లు, రిఫరీలు పాల్గొన్నారన్నారు. ఆత్మ రక్షణకు కరాటే దోహద పడుతుందన్నారు. ఒంగోలులో అత్యాధునిక సౌకర్యాలతో క్రికెట్ స్టేడియం, ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేస్తామన్నారు. సిద్ధార్థ కరాటే డు అసోసియేషన్ అధ్యక్షులు, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి మాట్లాడుతూ నల్లూరి మోహనరావు కరాటే క్రీడ అభివృద్ధికి తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. రాష్ట్రంలో కరాటే క్రీడకు తగిన గుర్తింపు, క్రీడాకారులకు ప్రోత్సాహం లేదని, ఈ విషయమై ఎమ్మెల్యే దామచర్ల నేతృత్వంలో సిఎం, క్రీడల మంత్రితో చర్చించాలని కోరారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్.విజయకుమార్ మాట్లాడుతూ క్రీడాకారుల శారీరక, మానసిక వికాసానికి క్రీడలు దోహదపడతాయన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలను క్రీడలలో ప్రోత్స హించాలన్నారు. రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ మాట్లాడుతూ 2019-24 మధ్య కాలంలో క్రీడలు, స్టేడియాల నిర్వహణలో వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ క్రీడల హబ్‌గా రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ పోటీలలో రాణిస్తున్నారన్నారు. అనంతరం సౌత్ ఇండియా కరాటే ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కెఎంఎల్ శాస్త్రి, ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, లీడ్ కోచ్ టీమ్ ఇండియా హన్షి కీర్తన్ కొండూరు మాట్లాడారు. విజేతలకు ఎమ్మెల్యేలు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న అతిథులను నిర్వాహకులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ కరాటే డు అసోసియేషన్ చైర్మన్ మండవ మురళీకృష్ణ, జిల్లా కరాటే అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి మండవ సుబ్బారావు, శ్రీ ప్రతిభా విద్యా సంస్థల సిఈఓ నల్లూరి జయప్రకాష్ నారాయణ్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు, డిఎస్‌డిఓ జి.రాజరాజేశ్వరి, టిడిపి ఒంగోలు నగర అధ్యక్షుడు బండారు మదన్, ప్రధాన కార్యదర్శి బోడపాటి వెంకట్, కరాటే రిఫరీలు, వికోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు

ప్రజాస్వామ్య రక్షణకు యువత ముందుకు రావాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు జివి.కొండారెడ్డి

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

ప్రజాస్వామ్య రక్షణ కోసం యువత ముందుకు రావాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు జివి.కొండారెడ్డి పిలుపు నిచ్చారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్‌ఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఒంగోలు ఎల్‌బీజీ భవన్‌లో జిల్లా స్థాయి తరగతులు ఆదివారం నిర్వహించారు. శిక్షణా తరగతులకు డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు కెవి.పిచ్చయ్య ప్రిన్సిపల్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ నేటి ప్రజాస్వామ్య వ్యవస్థ చెడు మార్గాలకు లోనవుతుందన్నారు. యువత చెడు ప్రభావాలకు లొంగకుండా ప్రజాస్వామ్య రక్షణలో భాగస్వాములు కావాలన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు నిరుద్యోగులను మోసం చేస్తున్నాయని విమర్శించారు. పరిశ్రమల స్థాపన ద్వారానే నిరుద్యోగ సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు. యువత కోసం ఆ దిశగా ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. 'డ్రగ్స్ అంతం- డివైఎఫ్‌ఐ పంతం' అనే నినాదంతో యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగంపై అవగాహన పెంపొందించుకోవడం, లౌకికవాదాన్ని కాపాడుకోవడం నేటి యువత ముఖ్య బాధ్యతలని తెలిపారు. స్వాతంత్రం వచ్చి 79 ఏళ్లు గడిచినా దేశంలో పేదరికం తగ్గకుండా పెరుగుతూనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ఫాసిస్టు శక్తులను ఎదుర్కోవడంతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడం కూడా ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలు బలపడితేనే నిరుద్యోగ సమస్య తగ్గి దేశం సస్యశ్యామలం అవుతుందన్నారు. ఆ దిశగా యువత నిరంతరం పోరాటాలు కొనసాగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కెఎఫ్.బాబు, నాయకులు పి.నరేంద్ర, ఎం.కొండయ్య, పి.కిరణ్, నవీన్ కుమార్, పీరా సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జివి.కొండారెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్

బీసీల అభ్యున్నతికి కృషి

ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

బీసీల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఒంగోలు దామచర్ల జనార్ధన్‌రావు పేర్కొన్నారు. ఒంగోలు ఉగ్గలకుంటలోని జిల్లా గౌడ భవన్(ఆరామ క్షేత్రం)ను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభకు గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ జంపాని రామచంద్రరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీసీ కులాలన్నింటికి ఒకేచోట ఆరామ క్షేత్రాలు ఏర్పాటు చేసి దాన్ని తాను ప్రారంభించటం సంతోషంగా ఉందన్నారు. గౌడలు ఎక్కువ శాతం తెలుగుదేశం పార్టీ వెంటే ఉన్నారని, వారికి ఎప్పుడు పార్టీ అండగా ఉంటుందన్నారు. గౌడ కార్పొరేషన్ చైర్మన్ వారంకి వెంకట గురుమూర్తి మాట్లాడుతూ ఒంగోలు నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గౌడ భవన్‌ను ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు ప్రారంభించటం సంతోషంగా ఉందన్నారు. గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాకా రామ్‌గోపాల్ మాట్లాడుతూ మంచి కార్యక్రమాలు చేపట్టాలంటే గౌడలు ముందు ఉంటారని, ప్రకాశం జిల్లా ఉద్యమాల గడ్డ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, పిడిసిసి బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, కార్పొరేషన్ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు బలగాని ఆంజనేయులు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శైలజ, రాష్ట్ర మహిళా సంఘ అధ్యక్షురాలు చెన్న విజయలక్ష్మి, రాజులపాటి కళ్యాణి, ప్రధాన కార్యదర్శి వేముల వెంకటాచలం, కృష్ణా, గుంటూరు జిల్లాల గౌడ సంఘం అధ్యక్షులు, గౌడ ఆరామ క్షేత్రం అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సినీ నటుడు రఘుబాబును సత్కరిస్తున్న నిర్వాహకులు

'నాగభైరవ' పురస్కార ప్రదానోత్సవం

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు పురస్కార ప్రదానోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఒంగోలు రెడ్‌క్రాస్ భవనంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సినీనటుడు రఘుబాబు, సాహితీవేత్తలు, కళాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సినీ నటుడు రఘుబాబు మాట్లాడుతూ నాగభైరవ కోటేశ్వరరావుతో తమ కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని స్మరించుకున్నారు. నల్లూరి వెంకటేశ్వర్లు, ఈదర హరిబాబు, కళామిత్ర మండలి అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు నాగభైరవ సాహిత్య విశిష్టత ఆయన కవిత్వం, గద్యంపై చూపిన ముద్రను ప్రశంసించారు.ఈ సందర్భంగా సాహిత్య పీఠం తరఫున సాహిత్య పురస్కారం రాచపాళెం చంద్రశేఖరరెడ్డి (నెత్తురునది), కోనేరు కల్పన (దర్పణం) కళా పురస్కారం కెకెఎల్. స్వామికి, ఆత్మీయ పురస్కారం సినీ నటుడు గిరిబాబు తరపున రఘుబాబుకు అందజేశారు. విజేతలకు రూ.10,000, రూ.5,000 వంతున నగదు పురస్కారం అందజేసి మెమోంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, డాక్టర్ నూనె అంకమ్మరావు, వి. ఝాన్సీ దుర్గ, బీరం అరుణ, సింహాద్రి జ్యోతిర్మయి, పోతినేని వెంకటేశ్వర్లు, బెజవాడ రామారావు, డాక్టర్ నాగభైరవ ఆంజనేయులు, స్థానిక కవులు, రచయితలు, కళాకారులు పాల్గొన్నారు.

నాగభూషణరావు సత్కరిస్తున్న వాసవీ సభ్యులు

నాగభూషణరావుకు అవార్డు

ప్రజాశక్తి - బట్టిప్రోలు

స్థానిక సాయి బాబ మందిరంలోని కళ్యాణ కళావేదికపై నంబూరు నాగభూషణరావుకు నీతి ఆయోగ్, మనం ఫౌండేషన్ భారత్ సేవా రత్న నేషనల్ అవార్డు, గౌరవ డాక్టరేట్‌ను స్వతంత్ర దినోత్సవ వేడుకల రోజు అందజేశారు. ఈ అవార్డు పొందిన సందర్భంగా భట్టిప్రోలు, వెల్లటూరు వాసవి క్లబ్స్, ఆర్యవైశ్య సంఘం సంయుక్తంగా అభినందన సభ ఆదివారం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు చన్నా వెంకట ఉమామహేశ్వ రరావు మాస్టారు అధ్యక్షత వహించారు. ఆర్యవైశ్య సంఘ జిల్లా అధ్యక్షులు తూనుగుంట్ల శ్రీనివాసరావు, సాయిబాబా ఆలయ కమిటీ చైర్మన్ తమ్మన రమేష్ బాబు, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ తూనుగుంట్ల శ్రీధర్, జోన్ చైర్మన్ బూర్లే సుబ్బారావు, భట్టిప్రోలు వాసవి క్లబ్ అధ్యక్షులు బూర్లే వెంకట చంద్రశేఖర్, యువజన సంఘ అధ్యక్షులు అచ్యుత నాగ రమేష్, కుబేర వనిత వాసవి క్లబ్ అధ్యక్షులు మద్దుల లక్ష్మీ ప్రియా, వెల్లటూరు వాసవి క్లబ్ అధ్యక్షులు నాగళ్ళ ఆంజనేయులు, భట్టిప్రోలు ఉపసర్పంచ్ బూర్లే రాంప్రసాద్, వాసవి క్లబ్ పిఆర్ఒ యెండూరి సత్యనారాయణ, రీజియన్ చైర్మన్ యెండూరి రాఘవేంద్రరావు తదితరులు మాట్లాడుతూ నాగబూషణరావు సేవలను కొనియాడారు. టిఎం రావు పాఠశాల ప్రధానోపాధ్యాయులు చందులూరి రామకోటేశ్వరరావు సన్మాన గ్రహీత జీవిత విశేషాలు వివరించారు.

నేడు రైతులకు రుణాలు అందజేత

ప్రజాశక్తి - భట్టిప్రోలు

పర్చూరు రమేష్

స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పరిధిలోని రైతులకు 2025-26 సంవత్సరానికి 85 మంది రైతులకు సిసి, వ్యవసాయ రుణాల క్రింద రూ.5.31కోట్ల విలువైన చెక్కులు శాసన సభ్యులు నక్కా ఆనంద బాబు చేతుల మీదగా సోమవారం పంపిణీ చేయనున్నట్లు సొసైటీ చైర్ పర్సన్ పర్చూరు రమేష్ తెలిపారు. తమ సహకార పరపతి సంఘం కార్యాలయంలో జరిగే కార్యక్రమానికి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ మక్కిన మల్లికార్జునరావు హాజరవుతారని తెలిపారు. ఇటీవల ఐలవరం గ్రామానికి చెందిన రైతు బొజ్జ ఏసుబాబు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆయన కుటుంబానికి రూ.2లక్షల బీమా చెక్కు కూడా అందించను న్నట్లు తెలిపారు. సొసైటీ పరిధిలోని రైతులు, కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

ఎరువులు పంపిణీ చేస్తున్న సొసైటీ అధ్యక్షుడు తాతాజీ

రైతులకు ఎరువులు పంపిణీ

ప్రజాశక్తి - చెరుకుపల్లి

రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు కావలసిన మొత్తంలో తీసుకోవాలని ఎఒ ఎండి ఫరూక్ తెలిపారు. కావూరు పిఎసిఎస్ పరిధిలోని రైతులకు యూరియ, తదితర ఎరువులను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9400 ఎకరాలు వరి వెద, నాటు పద్దతుల్లో సాగు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం కావూరు పిఎసిఎస్‌లో యూరియా 40 టన్స్, జిడీసీమ్స్, పొన్నపల్లిలో 60టన్నులు, చెరుకుపల్లిలోని రిటైలర్స్ డీలర్లు దగ్గర 90 టన్నులు యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. రైతులు అవసరం మేరకే ఎరువులు కొనుగోలు చేయాలని తెలిపారు.

వ్యవసాయ కార్యాలయానికి దారేదీ ?

ప్రజాశక్తి - వేమూరు

నియోజకవర్గ కేంద్రమైన వేమూరు వ్యవసాయ అధికారి కార్యాలయానికి వెళ్లేందుకు సరైన రహదారి లేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఎన్నో ఏళ్ల క్రితం ఈ కార్యాలయం భవనానికి దాతలు స్థలాన్ని కేటాయించారు. ఈ స్థలంలో ప్రభుత్వ నిధులతో భవనాన్ని నిర్మించారు. దాతలు స్థలం కేటాయించిన సమయంలో రహదారి కూడా ఏదో ప్రక్కన చూపే ఉంటారు. కానీ ఆ రహదారి ఎటువైపు ఉందో అధికారులకు గానీ, చుట్టుపక్కల వారికి గాని తెలియని పరిస్థితి నెలకొంది. దీనికి తోడు కార్యాలయం ఎదురుగా ఉన్న స్థలం లోతట్టు ప్రాంతంగా ఉండి వర్షాల సమయంలో రెండు నుండి మూడు అడుగుల లోతు నీరు నిలబడి ఉంటుంది. ఈ కార్యాలయానికి వెళ్ళటానికి రైతులు, కార్యాలయ సిబ్బంది నీటిలోనే దిగి వెళ్ళవలసిన దుస్థితి ఏర్పడుతుంది. వర్షాకాలంలో నిలబడిన నీరు నెలలు తరబడి ఉండటంతో సిబ్బంది నిత్యం కార్యాలయానికి వెళ్ళటానికి నాన్న అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఎప్పటికప్పుడు మండల

వేమూరు వ్యవసాయ అధికారి కార్యాలయం

స్థాయి అధికారులు వారి విధులు చూసుకుని వెళ్లిపోవడం తప్ప ఈ భవనానికి వచ్చే రైతులకు అవసరమైన రహదారి ఏర్పాటు చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని రైతుల ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న వ్యవసాయ అధికారి మరింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, కార్యాలయానికి వెళ్ళే మార్గం లేకపోవడంతో ఒక్కో సమయం గ్రామాలకు క్యాంపులకు వెళ్లినట్లు చెప్పటం, లేదా డ్యూటీకి డుమ్మా కొట్టి అక్కడ మీటింగ్ ఉంది, ఇక్కడ మీటింగ్ ఉందని చెప్పి సక్రమంగా రావడం లేదనే ఆరోపణ ఉన్నాయి. నిత్యం రైతులకు అందుబాటులో ఉండాల్సిన వ్యవసాయ అధికారి సకాలంలో కార్యాలయానికి రాకపోవడంతో వివిధ పనులపై వచ్చే రైతులు వర్షపు నీటిలోనే దిగి వెళ్లి కార్యాలయంలో అధికారులు లేకపోవడంతో ఆసహనానికి గురవుతున్నారు. తిరిగి మరల అదే వర్షపు నీటిలో వెనుకకు రావలసిన దుస్థితి నెలకొంటుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ చూపి కార్యాలయానికి వెళ్లే రహదారి తగిన ఏర్పాట్లు చేయాలని, వ్యవసాయ అధికారి రైతులకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని రైతులు కోరుచున్నారు. ఈ విషయంపై ఎఒ ప్రేమ్ సాగర్ మాట్లాడుతూ కార్యాలయానికి రహదారి వ్యవహారంలో తానేమి చేయలేనని అన్నారు. ప్రతిరోజు కార్యాలయంలో ఉండటం కుదరదని, మండలంలో ఏదో ఒక గ్రామంలో రైతులను కలసి సమీక్షించాల్సి ఉంటుందని అన్నారు.

ఆర్టీసీ ఆస్తులు ప్రైవేటు పరం చేయొద్దు

ప్రజాశక్తి - బాపట్ల

ప్రభుత్వం ఆర్టీసీ స్థలాలను ప్రైవేటు షాపింగ్ మాల్‌కు కేటాయిస్తూ జారీ చేసిన జిఒ నం.137ను వెంటనే రద్దు చేయాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బిటి వలి డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ బిల్డింగులో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ ఆస్తులు కాపాడుకోవడం కోసం అన్ని సంఘాలు ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని కోరారు. ప్రజా రవాణా సంస్థ ఆస్తులు ప్రైవేటు వ్యాపార సంస్థలకు ధారా దత్తం చేయడాన్ని తాము అంగీకరించేది లేదన్నారు. విజయవాడ నగర నడిబొడ్డునున్న గవర్నర్‌పేట డిపో, పాత బస్టాండ్‌కు చెందిన నాలుగు ఎకరాల స్థలం సుమారు రూ.400 కోట్ల విలువ చేసే స్థలాన్ని షాపింగ్ మాల్‌కు అప్పగించడం ప్రజల ప్రయోజనాలకు విరుద్ధమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ రెండు డిపోల్లో 200 బస్సులు, 1100 మంది ఉద్యోగులు ప్రజలకు సేవలు అందిస్తున్నారని అన్నారు.

మాట్లాడుతున్న ఆర్టీసీ యూనియన్ నాయకులు

వారికి కనీస సదుపాయాలు కల్పించకుండా ఆర్టీసీ స్థలాలను ప్రైవేట్ వ్యాపారవేత్తలకు కట్టబెట్టడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. జిల్లా మాజీ కార్యదర్శి వైఎస్ రావు మాట్లాడుతూ 1959లో అప్పటి ప్రభుత్వం నిర్ణయించిన గజం రూ.16 ధరతో సుమారు రూ.4.60 లక్షలకు ఆర్టీసీ యాజమాన్యం ఈ భూమిని కొనుగోలు చేసిందని గుర్తు చేశారు. ఇంత విలువైన ప్రజా ఆస్తిని కొద్ది మంది వ్యాపారవేత్తల చేతుల్లో పెట్టడం చరిత్రలోనే పెద్ద తప్పిదమని అన్నారు. యూనియన్ జిల్లా కార్యదర్శి పి కమలాకర్‌రావు మాట్లాడుతూ ప్రజల సౌకర్యాల కోసం ఏర్పడిన ఆర్టీసీ ఆస్తులు కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. నేడు డిపోలు, బస్టాండ్ భూములు అమ్మేస్తే రేపు ఉద్యోగుల భవిష్యత్తు, ప్రజా రవాణా సదుపాయాలే ప్రమాదంలో పడతాయన్నారు. ప్రభుత్వం తక్షణమే జిఒ నం.137ను రద్దు చేసి ప్రజా ప్రయోజనాలు కాపాడాలని కోరారు. నెల్లూరు జోనల్ మహిళా నాయకురాలు పి రజిని మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు, సిబ్బంది ఈ పోరాటంలో చురుకుగా పాల్గొంటారని చెప్పారు. ఆర్టీసీ ఉద్యోగుల భవిష్యత్తు, మహిళా సిబ్బంది భద్రత ఈ ఆస్తులపై ఆధారపడి ఉన్న దృష్ట్యా ప్రభుత్వం మహిళల అభ్యర్థనను పరిగణలోకి తీసుకోవాలని కోరారు. యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ఎంపి కుమార్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం చింపనయ్య, డిపో అధ్యక్షులు చంద్రశేఖర్, కార్యదర్శి వైఎన్ రావు, ఐఎస్ రావు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో డిఎపి

ప్రజాశక్తి - బాపట్ల

మండలంలోని రైతులకు డిఏపీ, యూరియా, ఇతర ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఎఒ శారద తెలిపారు. యూరియా 325, డిఏపి 122, ఎంఓపి 308, ఎస్ఎస్‌పి 49, కాంప్లెక్స్ ఎరువు 416 టన్నుల మేర ఎరువులు అందుబాటులో ఉంచామని తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డు, జిడిసి ఎంఎస్, మండలంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఎరువులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అమర్తలూరు : మండలంలో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఎఒ ఎం హేమంత్ భరత్ కుమార్ తెలిపారు. ఇప్పటివరకు 8వేల ఎకరాల్లో వరి వెద సాగు చేశారని తెలిపారు. సుమారుగా 9వేల ఎకరాల్లో ఇప్పటివరకు నాటు పద్ధతిలో కూడా వరి సాగు చేశారని తెలిపారు. మండలంలో మొత్తం 17వేల ఎకరాల్లో వరి పంట సాగులో ఉన్నట్లు చెప్పారు. మండలంలోని ఐదు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, ప్రవేట్ దుకాణాల వద్ద 1400 మెట్రిక్ టన్నుల యూరియా, 750 మెట్రిక్ టన్నుల డిఎపి రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. అలాగే ప్రస్తుతం 120 మెట్రిక్ టన్నుల యూరియా, 143 మెట్రిక్ టన్నుల డిఏపి, 240 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు సొసైటీలు, ప్రవేట్ దుకాణాల్లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. రానున్న రెండు రోజుల్లో యూరియా, డిఏపి ఎరువులు అన్ని సొసైటీలకు అందజేస్తామని తెలిపారు. రైతులు

ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న ఎఒ శారద

పైపాటుగా కాంప్లెక్స్ ఎరువులు వాడకం తగ్గించాలని చెప్పారు. డిఏపి ఎరువులు ఎప్పుడూ దమ్ములో కానీ, దుక్కిలో గాని వేసుకోవడ వలన మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. రైతులు యూరియా కొరత ఉన్నట్లు వస్తున్న ప్రచారాన్ని నమ్మవద్దని చెప్పారు.

కొల్లూరు : ఎరువులు కోసం రైతులు ఎవరూ ఆందోళన చెందవలసిన అవసరం లేదని ఎఒ వి నరేంద్రబాబు తెలిపారు. మండలంలో యూరియా 110 ఎంటి, డిఏపి 150 ఎంటి, పొటాష్ 60 ఎంటి, ఎస్ఎస్‌పి 8 ఎంటి, కాంప్లెక్స్ 230 ఎంటి ఉన్నాయని తెలిపారు. పిఎసిఎస్, ప్రైవేటు డీలర్ల ద్వారా, జిడిసీఎం సంస్థ ద్వారా రైతులకు అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈనెల 20 నుంచి రైతు సేవా కేంద్రాల ద్వారా కూడా ఎరువులు అందిస్తామని తెలిపారు. రైతులు ప్రైవేట్ వ్యాపారస్తులు దగ్గర ఎరువులు, పురుగు మందులు కొన్నప్పుడు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని తెలిపారు. అనధికారికంగా ఎరువులు నిల్వ ఉంచిన, లైసెన్స్ లేకుండా అమ్మకాలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పుస్తకం ప్రదర్శిస్తున్న సాహితీ వేత్తలు

'ఏకాంత స్పర్శ' పుస్తక సమీక్ష

ప్రజాశక్తి - అద్దంకి

సాహితీ స్రవంతి అధ్యక్షులు చందలూరి నారాయణరావు వ్రాసిన 3వ వచన కవితా సంపుటి 'ఏకాంత స్పర్శ' సమీక్ష సమావేశం ఆదివారం స్థానిక చిన్ని శాంతయ్య, పిచ్చమ్మ సేవాసదన్‌లో నిర్వహించారు. సాహితీ స్రవంతి ప్రధాన కార్యదర్శి ఆర్‌వి రాఘవరావు అధ్యక్షత వహించారు. సంస్థ ఉపాధ్యక్షులు మిట్టా కామేశ్వరశర్మ, తిమ్మయపాలెం హెచ్‌ఎం పెంట్యాల గంగాధర్, సృజన అధ్యక్షులు గాడేపల్లి దివాకరదత్తు, అన్నమనేని వెంకట్రావు, డాక్టర్ వలివేటి సుబ్బారావు, రాఘవరావు, యు దేవపాలన, ధర్మవరపు శ్రవణ్ కుమార్, వెలసిరి రమణ, ఇట్ట రామారావు, వెలసరి కపర్ది, పరుచూరి నాగలక్ష్మి, యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

'పందిల్లమ్మ'ను దర్శించుకున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని పందిళ్ళపల్లిలో వేంచేసియున్న పందిల్లమ్మ అమ్మవారికి టిడిపి నాయకులు ఆవుల అశోక్ కుమార్ ఆదివారం పొంగళ్ళు నిర్వహించారు. శాసన సభ్యులు ఎంఎం కొండయ్య హాజరై అమ్మవారిని దర్శించుకు న్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ మించాల సాంబ శివరావు, ఎఎంసి చైర్మన్ జనార్ధనరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో భట్టిప్రోలు పిఎసిఎస్

రూ.120 కోట్ల వ్యాపారంతో అగ్రస్థానం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

నిత్యం రైతులకు అందుబాటులో ఉంటూ రైతులకు అవసరమైన రుణాలు, ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు సకాలంలో సరఫరా చేస్తూ బట్టిప్రోలు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం రైతుల మన్ననలు పొందుతుంది. ప్రస్తుతం ఈ సంఘం జిల్లాలోనే కాక రాష్ట్రంలోనే రూ.120 కోట్ల వ్యాపార లావాదేవీలతో ముందంజలో ఉంది. సొసైటీ పరిధిలో తొమ్మిది రెవెన్యూ గ్రామాలు వ్యాపార విస్తీర్ణంలో విలీనమై ఉన్నాయి. సంఘం పరిధిలో 44304 మంది జనాభా ఉండగా వీరిలో ఏడాది మార్చి 31 నాటికి 11956 మంది సభ్యులుగా చేరారు. ఈ సంఘం పరిధిలో 15895 ఎకరాల భూమి ఉండగా దానిలో 11401 ఎకరాల మాగాణి భూమి, 4494 ఎకరాల మెట్ట భూమి ఉంది. ఈ మాగాని భూమిలో వరి, మొక్కజొన్న, అపరాలు పండిస్తుండగా మెట్ట భూమిలో అరటి, పసుపు, కంద, చెరుకు, నిమ్మ, జామ, మొక్కజొన్న, కూరగాయలు వంటి పంటలు పండిస్తూ ఉంటారు. గత 25ఏళ్లుగా ఈ సంఘం ఎపి మార్క్‌ఫెడ్, ఇఫ్కో, క్రిబ్ కో వంటి సంస్థల ద్వారా రైతులకు అవసరమైన ఎరువులు, నాణ్యమైన విత్తనాలు సరఫరా చేస్తూ ఉంటుంది. ప్రస్తుతం సంఘ ఛైర్మన్‌గా పరశు రమేష్ జులై 9 నుండి బాధ్యతలు చేపట్టారు. ఆయన బాధ్యతలు చేపట్టే నాటికి సంఘం రు.120 కోట్ల వ్యాపార లావాదేవీలతో పనిచేస్తుంది. ఛైర్మన్‌గా రమేష్ బాధ్యతలు చేపట్టే నాటికి 4852మంది రైతులకు సంఘం నందు ఎస్ఏఓ రుణాలు, దీర్ఘకాలి కారణాల కింద పాడి గేదలు, గొర్రెలు, అరటి తోటల పెంపకం, భూమి అభివృద్ధి రుణాలు, సిసిఓడి రుణాలు, మధ్య కాలిక రుణాలు, బ్రిడ్జి రుణాలు మంజూరు జరిగాయి. ప్రస్తుతం జరుగుతున్న రూ.120 కోట్ల వ్యాపార లావాదేవీల్లో సుమారు రు.60 లక్షలకుపైగా లాభాలు లభించే అవకాశం ఉన్నట్లు ఛైర్మన్ రమేష్ తెలిపారు. తాను బాధ్యతలు చేపట్టిన తర్వాత మరింతగా సిసి రుణాలు, ఎట్‌టి రుణాలు మంజూరు చేసినట్లు చెప్పారు.

భట్టిప్రోలు పిఎసిఎస్ కార్యాలయం

2005లో ఓలేరు సొసైటీ భట్టిప్రోలులో విలీనం

మండలంలో గతంలో భట్టిప్రోలు తోపాటు ఓలేరు, సూరేపల్లి వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఉండేవి. వీటిలో 2005లో ఓలేరు సొసైటీని భట్టిప్రోలు సొసైటీలో విలీనం చేశారు. విలీనం అనంతరం తొలిసారిగా పెసర్లంక గ్రామానికి చెందిన దేవభక్తుని నాగవీర బసవయ్య సంఘ అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టారు. ఆయన బాధ్యతలు చేపట్టే నాటికి సంఘం రూ.4.56 కోట్ల వ్యాపారం జరుగుతుండగా దీనిలో రూ.2.40కోట్లు నష్టాల బాటలో ఉన్న సొసైటీని నాగ వీర బసవయ్య ఆధ్వర్యంలో నష్టాలను అధిగమించి రూ.10.77 లక్షలు లాభాల తీసుకొచ్చారు. బసవయ్య అనంతరం మాజీ శాసన సభ్యులు ముమ్మనేని వెంకట సుబ్బయ్య సొసైటీ అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టారు. ఆయన ఆధ్వర్యంలో రైతులకు అన్ని రకాల రుణాలు అందిస్తూ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా మార్క్‌షెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతుల నుండి 1.75లక్షల క్వింటాళ్ల మొక్కజొన్న, జొన్న, వరి కొనుగోలు చేసి అప్పట్లో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచి బహుమతులు పొందింది.

2008లో నూతన సీఈఓగా వేములపల్లి శ్రీనివాసరావు

భట్టిప్రోలు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి 2008లో నూతన సీఈఓగా పెసరలంక గ్రామానికి చెందిన వేములపల్లి శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు. ఆయన బాధ్యతలు చేపట్టే నాటికి సంఘం రూ.7.05 కోట్లు వ్యాపారం కొనసాగిస్తూ ఉండగా సంఘానికి రూ.64.14 లక్షలు నష్టాల బాటలో ఉంది. సీఈఒ సమయస్ఫూర్తి, రైతుల పట్ల గౌరవ మర్యాదలతో, అధికారులు ప్రజాప్రతినిధుల సహకారంతో సంఘాన్ని ముందుకు నడిపించారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా సహకార సంఘాల పరిధిలో రూ.200 కోట్ల వ్యాపార లావాదేవీలు కొనసాగిస్తుండగా దానిలో రూ.120 కోట్లు భట్టిప్రోలు సొసైటీ నుండి వ్యాపారాలు జరిపిస్తూ రూ.60 లక్షలకు పైగా లాభాలను గడించే స్థాయికి తీసుకువెళ్ళటం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ సొసైటీలో సీఈఓతో పాటు స్టాఫ్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్, ఇద్దరు గుమస్తాలు, ఒక సేల్స్ మాన్, అటెండర్ పనిచేస్తున్నారు.

రైతులకు అందుబాటులో గోదాములు

ఈ సొసైటీ పరిధిలో రైతులకు అందుబాటులో ఉండే విధంగా పోలేరు గ్రామంలో 200 మెట్రిక్ టన్నుల గోడౌను, ఓలేరు, వెల్లటూరు గ్రామాల్లో 500 మెట్రిక్ టన్నుల ఎంసిఎఫ్‌సి గోడౌన్లు రైతుల సరుకులు నిలవ చేసుకునేందుకు అందుబాటులో ఉంచారు. భట్టిప్రోలు మార్కెట్ యార్డు ప్రాంగణంలో అప్పటి జిడిసిసిబి ఛైర్మన్ ముమ్మనేని వెంకట సుబ్బయ్య కృషితో 7సెంట్ల స్థలంలో 2018లో నూతన భవనాన్ని ఏర్పాటు చేసి కార్యకలాపాల కొనసాగిస్తున్నారు. ఈ సంఘ అభివృద్ధికి పూర్వ అధ్యక్షులు దేవభక్తుని నాగవీర బసవయ్య, ముమ్మనేని వెంకట సుబ్బయ్య, గుమ్మడి సాంబశివరావు, పాలకవర్గ సభ్యులు, అధ్యక్షులు పర్చూరు రమేష్, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధ్యక్షులు మక్కిన మల్లికార్జునరావు, సిఇఒ చింతల అజయ్ కిషోర్, నోడల్ అధికారి దుప్పలపూడి శ్రీనివాస్, బ్యాంకు సిబ్బంది కృషి సహకారంతో సొసైటీ అభివృద్ధి పథంలో నడుస్తుందటంలో అతిశయోక్తి లేదు. ఇదిలా ఉండగా సంఘ కార్యాలయంలో ప్రధానమంత్రి భారతీయ ఔషధీ కేంద్రం ద్వారా కూడా సంఘ పరిధిలోని గ్రామాలతో పాటు ఇతర గ్రామాల ప్రజల సౌకర్యార్థం అతి తక్కువ ధరలకు జనరిక్ మందుల షాపును అందుబాటులోకి తెచ్చినట్లు సొసైటీ అధ్యక్షులు రమేష్ తెలిపారు.

వైరల్ జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు
- మొదలైన వైరల్ జ్వరాలు
- పట్టణంలోని వైద్యశాల్లో పెరుగుతున్న రోగులు
- కాచి చల్లార్చిన నీటినే తాగాలి
- చిన్నపాటి జ్వరాలైనా అశ్రద్ధ వద్దు

ప్రజాశక్తి - అద్దంకి

వర్షా కాలం, మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా వైరల్ ఇన్ఫెక్షన్లు, జ్వరాల కేసులు పెరుగుతున్నాయి. చిన్నారుల్లో ఎక్కువ మంది వీటి బారిన పడుతున్నారు. గాలి, నీరు, దోమల వల్ల వైరల్ ఇన్ఫెక్షన్లు ఎక్కువగా వ్యాపిస్తున్నాయి. వర్షా కాలంలో గాలి ద్వారా జలుబు, ఇన్‌ఫ్లూయెంజా, వైరల్ ఫ్లూ వంటి ఇన్ఫెక్షన్లు వస్తాయి. నీరు కలుషితం అవ్వడం వల్ల డయేరియా వచ్చే అవకాశం ఉంది. వైరల్ ఇన్ఫెక్షన్లు మన శరీరంలోని శ్వాసకోశ, ప్రేగు, గుండె, నాడీ వ్యవస్థ వంటి ఏదైనా అవయవ వ్యవస్థపై ప్రభావం చూపుతాయి. వర్షా కాలంలో ఎక్కువగా కనిపించే వైరల్ ఇన్ఫెక్షన్ జ్వరం.

వైరల్ ఫీవర్ లక్షణాలు

వైరల్ ఫీవర్ సోకిన వ్యక్తి శరీర ఉష్ణోగ్రత 99 ఎఫ్ నుండి 103ఎఫ్ (39సి) వరకు ఉంటుంది. చలి, తలనొప్పి, కండరాల నొప్పులు, నీరసంగా ఉండటం, ఆకలి లేకపోవడం, వాంతులు, వికారం, మైకం, కళ్లు ఎర్రబడటం, చర్మంపై దద్దుర్లు వంటి లక్షణాలు కనిపిస్తాయి. వీటిని గుర్తిస్తే తప్పనిసరిగా ఆసుపత్రికి వెళ్లి వైద్యుని సూచనలు పాటించాలని వైద్యులు తెలుపుతున్నారు. అవసరమైన వైద్య పరీక్షలు చేయించుకోవాలని చెబుతున్నారు. ఆర్‌ఎంపిల వద్ద కాలం గడిపితే జబ్బు తీవ్రత పెరిగే ప్రమాదం ఉంటుందని చెబుతున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోండి

వైరల్ ఫీవర్ లక్షణాలు కనిపిస్తే డాక్టరు సూచించిన మందులు వాడాలి. పిల్లలకు సొంత వైద్యం ఎట్టి పరిస్థితుల్లో చేయవద్ద. డాక్టర్ సూచించిన ఔషధాలు మాత్రమే వాడాలి. ఫీవర్ ఉన్నప్పుడు శరీరానికి తగినంత విశ్రాంతి అవసరం. రోజూ కనీసం 8 నుంచి 9 గంటల నిద్ర ఉండాలి. జ్వరం వల్ల వేడిగా మారిన శరీర ఉష్ణోగ్రతను తగ్గించడానికి గోరువెచ్చని నీటిలో ముంచిన వస్త్రాన్ని నుదిటిపై ఉంచాలి. వీలైనంత ఎక్కువగా గోరు వెచ్చని నీటిని తాగాలి. కెఫిన్ ఉన్న పానీయాలు, సోడా, కూల్‌డ్రింక్స్, ఆల్కహాల్ తీసుకోకూడదు. జ్వరంతో బాధపడే వ్యక్తి బట్టలు, రుమాలు, తువ్వాలు, ఇతర వ్యక్తిగత వస్తువులను ఇతరులు వాడకపోవడం మంచిది కాదు. దీని వల్ల ఇతరులకు వ్యాపించే అవకాశం ఉంటుంది. మీ ముక్కు, నోటిని తరచుగా తాకవద్దు. దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు రుమాలు లేదా చేతిని అడ్డంగా ఉంచుకోవాలి. సిట్రస్ పండ్లు, బెర్రీలు, బ్రకోలీ వంటి విటమిన్ సి అధికంగా ఉండే పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు తీసుకోవాలి. దీని వల్ల రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ పొందవచ్చు.

చిన్నారుల కోసం జాగ్రత్తలు పాటించాలి

వర్షాకాలంలో ఆరోగ్య పరంగా అనేక సవాళ్లను తీసుకువస్తుంది. ముఖ్యంగా ఇంట్లో చిన్నారుల విషయంలో ఈ కాలంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. అందుకు వైద్య నిపుణులు కొన్ని సూచనలు చేస్తున్నారు. అవేంటో చూద్దాం.

వర్షాకాలంలో వాతావరణం పగలు కాస్త వేడిగా, తేమగా, రాత్రిళ్లు చల్లగా ఉంటుంది. అందుకే పగలు చిన్నారులకు మృదువైన, తేలికపాటి దుస్తులు వేయాలి. రాత్రి పూర్తి స్లీవ్లతో కూడిన మందపాటి దుస్తులు పిల్లలను వెచ్చగా ఉంచుతాయి. వర్షా కాలంలో అంటు వ్యాధులు, ఇన్ఫెక్షన్ల ముప్పు ఎక్కువ. అందుకే స్కూలుకు వెళ్లే పిల్లలు వర్షంలో తడవకుండా చూసుకోవాలి. పిల్లలు బయటకు వెళ్ళేటప్పుడు రెయిన్ కోట్లు, గొడుగు తీసుకెళ్లేలా చూడాలి. వర్షా కాలంలో చిన్నారులు తరచుగా మూత్ర విసర్జన చేస్తుంటారు. పసిపిల్లల్లో తడి, ఫంగల్ ఇన్ఫెక్షన్లను నివారించడానికి డైపర్లు తరచుగా మార్చాలి. వర్షా కాలంలో దోమల ఉద్ధృతి ఎక్కువగా ఉంటుంది. వీటి వల్ల మలేరియా, డెంగ్యూ వంటి జ్వరాల ముప్పు ఎక్కువగా ఉంటుంది. వీటి బారి నుంచి చిన్నారులను రక్షించడానికి పిల్లలకు వదులు దుస్తులు వేయాలి. ఇంట్లో దోమతెరలు తప్పక వాడాలని వైద్యులు సూచిస్తున్నారు. వర్షాల వల్ల తాగునీరు కలుషితం అయ్యే అవకాశం ఎక్కువ. దీని వల్ల డయేరియా వ్యాప్తి చెందే అవకాశం ఉంటుంది. చిన్నారులకు శుద్ధ జలాలను లేదా మరిగించి, చల్లార్చిన పరిశుభ్రమైన నీటిని ఇవ్వాలి. బాత్రూంకు వెళ్లి వచ్చిన తర్వాత, బయట ఆడుకొని వచ్చాక, అన్నం తినడానికి ముందు చిన్నారులకు తప్పనిసరిగా హ్యాండ్ వాష్ చేసుకోవడం అలవాటు చేయాలి. తాజాగా ఇంట్లో వండిన భోజనాన్ని చిన్నారులకు పెట్టండి. పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. చిన్నారులు బయట నుంచి వచ్చాక కాళ్లు, చేతులు కడుక్కోమని చెప్పాలి. చిన్నారులు ఎక్కువగా ఫ్లోర్ మీదే ఆడుకుంటారు కాబట్టి ఫ్లోర్‌ను శుభ్రంగా ఉంచాలి. పిల్లలకు వేసే సాక్సులను, బట్టలు ఎప్పటికప్పుడు ఉతకాలి. పిల్లలు ఆడుకునే బొమ్మలు శుభ్రంగా ఉంచాలి. పసిపిల్లల వ్యాక్సిన్ల విషయంలో నిర్లక్ష్యం వహించవద్దు. చిన్నారుల్లో జలుబు, జ్వరం వంటివి కనిపిస్తే ఆలస్యం చేయకుండా డాక్టరుకు చూపించడం మంచిది. ఇంట్లో వండే ఆహారాన్ని పిల్లలకు పెట్టాలి. బయటి ఆహారానికి దూరంగా ఉంచాలి. పిల్లల ఆహారంలో ఆకుకూరలు, అరటి, బొప్పాయి, దానిమ్మ, బీట్రూట్ వంటివి ఉండేట్లు చూసుకోవాలి. వర్షా కాలంలో రోగనిరోధక శక్తిని పెంచడానికి డ్రై ఫ్రూట్స్, నట్స్ ఉత్తమ ఆహార పదార్థాలు అందించాలని వైద్యులు తెలుపుతున్నారు. సీజనల్ జ్వరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

రోడ్లును పరిశీలిస్తున్న ఛైర్మన్ మించాల సాంబశివరావు

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - చీరాల

పట్టణంలో పారిశుధ్య సమస్యలు, రోడ్ల మరమ్మత్తుల పనులు అవగాహన చేసుకుని పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఛైర్మన్ మించాల సాంబశివరావు పేర్కొన్నారు. అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అన్నారు. పట్టణంలోని 10, 11,వ వార్డుల్లో ఆయన ఆదివారం పర్యటించారు. రోడ్లు, డ్రైనేజీ కాలువలు, శుభ్రతా పనులు పరిశీలించారు. ప్రజలు పారిశుధ్య లోపాల వల్ల ఇబ్బందులు పడకూడదని అన్నారు. డ్రైనేజీ సమస్యలు, చెత్త తొలగింపు పనులు శానిటేషన్ అధికారులు సక్రమంగా నిర్వహించాలని అన్నారు. చెత్త ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్, ఫాగింగ్ తప్పనిసరిగా చేయాలని చెప్పారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు దృష్టిలో పెట్టుకుని అధికారులు పనిచేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులదేనని పేర్కొన్నారు. కాలువల్లో మురుగు తొలగించాలని చెప్పారు. డ్రైనేజీ పైపులైన్లు లీక్ అవుతున్న ప్రాంతాలు గుర్తించి వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని అన్నారు. పరిశుభ్రమైన తాగునీటిని అందించాలని అన్నారు. తాను పరిశీలించిన సమస్యలను అధికారులతో చర్చించి పరిష్కారిస్తానని అన్నారు.

పూజలు చేస్తున్న భక్తులు

భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ప్రతిష్ట

ప్రజాశక్తి - పంగులూరు

మండల కేంద్రమైన పంగులూరులో చిలుకూరివారి వంశదేవరా భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ప్రతిష్ట మహెూత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ ప్రతిష్ట మహెూత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చారు. వేద పండితులు శ్రీహరి నేతృత్వం రుత్విక్ బృందం శాస్త్రోక్తంగా పూజలు జరిపి దేవత మూర్తులను నూతన ఆలయంలో ప్రతిష్టించారు. పంగులూరు, చిన్నమల్లవరం, ఇంకొల్లు, నక్కలపాలెం, నాగండ్ల పరిసర ప్రాంతాలకు చెందిన చిలుకూరి వంశస్థులు, వారి ఆడపడుచులు, బంధువులు, మిత్రులు ఈ ప్రతిష్ట మహెూత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవంతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. అనంతరం శాంతి హెూమం, పూర్ణాహుతి, శాంతి కళ్యాణం వేద పండితులు నిర్వహించారు. మాజీ శాసనసభ్యులు బాచిన చెంచు గరటయ్య, చెంచు ప్రసాద్ ప్రతిష్ట మహెూత్సవంలో పాల్గొని దర్శించుకున్నారు. తరలివచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని గన్నవరంకు చెందిన కాకాని ఈస్టర్ బాబు (30) ఆదివారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్థులు తెలిపారని రెవిన్యూ అధికారులు తెలిపారు. మృతుడు వివాహితుడని తెలిపారు. మృతుని కుటుంబ సభ్యులను ఎంపిటిసి జి సతీష్, గ్రామ నాయకులు పరామర్శించి సానుభూతి తెలిపారు.

మృతుడు ఈస్టర్‌బాబు

ఎన్‌బిటి బాల సాహిత్యం పుస్తకాల ఆవిష్కరణలో జేసీ , ఇతర ప్రముఖులు

పుస్తకాలు భద్రపరచుకునే ఆస్తి

- జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాల కృష్ణ
- ఎన్‌బిటి బాల సాహిత్య ఆవిష్కరణ ఆకర్షణ
- సందడిగా మూడో రోజు పుస్తక ప్రదర్శన

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

పుస్తకాలు కూడబెట్టుకునే ఎనలేని ఆస్థి అని జిల్లా జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకష్ణ పేర్కొన్నారు. ఒంగోలు పుస్తక మహోత్సవం మూడవ రోజు సందర్భంగా ఆదివారం నన్ను మలచిన పుస్తకం అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పుస్తకాలు మనిషి కూడబెట్టుకోగలిగే గొప్ప ఆస్తిగా అభిప్రాయపడ్డారు. హైదరాబాదులో పుస్తక ప్రదర్శనలో పాల్గొనడం వల్లనే తనకు తెలుగు సాహిత్యం దగ్గరైందన్నారు. అదే ప్రేరణతోనే యుపిఎస్‌సి పరీక్షల్లో తెలుగు సాహిత్యాన్ని ఐచ్ఛికాంశంగా ఎంచుకున్నట్లు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఒంగోలు నగరంలో ఈ కార్యక్రమం చేపట్టడం సహసమేనని, ఈ సందర్భంగా నిర్వాహకులను అభినందించారు.ప్రతి నగరం లో పుస్తక ప్రదర్శనలు నిర్వహించాలని సూచించారు, తొలుత అన్ని బుక్ స్టాల్స్ సందర్శించి పుస్తకాలు కొనుగోలు చేశారు.

పుస్తక ప్రియులతో సందడి...

పుస్తక ప్రియుల రద్దీతో గ్రౌండ్ సందడిగా సాగింది. ఆదివారం సెలవుదినం కావడంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పుస్తక స్టాళ్లు పాఠకులతో కళకళలాడింది. పిల్లల కథలు, యాక్టివిటీ పుస్తకాలు, కామిక్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తల్లిదండ్రులు అట్లాస్, వ్యాసరచన లాంటి విద్యాసంబంధిత పుస్తకాలపై ఆసక్తి చూపారు.

సజనాత్మక వర్క్‌షాపు, ఇంద్రజాల ప్రదర్శన..

మధ్యాహ్నం 3 గంటలకు నేషనల్ బుక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంజులూరు కష్ణ కుమారి, సిఎ. ప్రసాద్ సమన్వయంతో పిల్లల కోసం సజనాత్మక రచన వర్క్‌షాప్ నిర్వహించారు. దాదాపు 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కొందరు కథలు రచించగా మరికొందరు చిత్రాలు గీశారు. సాయంత్రం 5.30 గంటలకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన విజ్ఞానప్రదమైన ఇంద్రజాల ప్రదర్శన (మ్యాజిక్ షో) పిల్లలను ఎంతో అలరించింది.

ఎన్‌బిటి బాల సాహిత్య పుస్తకాల ఆవిష్కరణ...

సాయంత్రం 6 గంటలకు ఎన్‌బిటి వారు తాజాగా ప్రచురించిన ఐదు బాల సాహిత్య పుస్తకాలను ఆవిష్కరించారు. జుజురానా (రచన: అనితా చౌహాన్, అనువాదం: మంచికంటి)

మంచి మిత్రులు (రచన: జాన్ కిలాక, అనువాదం: వంగీపురపు శారదాదేవి),షేరా–మిత్తు (రచన: మనోరమా జఫా, అనువాదం: ఎ. మధుబాబు),బుజ్జి గుడ్లగూబ బాలు (రచన: ప్రాన్సిస్కా సొట్టా, అనువాదం: పద్మావతి తులసి), తోకల కథ ఉన్నాయి. ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి ఎన్‌బిటి అధికారి డాక్టర్ పత్తిపాక మోహన్ నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కవి, రచయిత డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ మాట్లాడుతూ బాలసాహిత్యం పిల్లల మనసులను మలుస్తుందని తెలిపారు.

ప్రధాన అతిథి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ గంగిశెట్టి శివకుమార్ మాట్లాడుతూ, ఎన్‌బిటి లాంటి సంస్థలు చక్కటి బొమ్మలతో పిల్లల కోసం పుస్తకాలు తీసుకువస్తున్నాయన్నారు. ప్రతి కుటుంబం వీటిని పిల్లలకు అందించాలని సూచించారు. బాలసాహిత్యం జీవన విలువలను బోధించే గొప్ప ఆయుధమని పేర్కొన్నారు.

ఈ సభలో జెవివి నాయకులు, విశ్రాంత ప్రిన్సిపల్ ఎవి. పుల్లారావు, ప్రముఖ వైద్యులు డాక్టర్ నాగేశ్వరరావు, ముంజులూరి కష్ణకుమారి, పునాటి ఆంజనేయులు, నూకతోటి రవికుమార్, నల్లూరి వెంకటేశ్వర్లు, దార్ల బుజ్జిబాబు, ఉదయ కిరణ్, ప్రజాశక్తి బుక్ హౌస్ జనరల్ మేనేజర్ కె.లక్ష్మయ్య తదితరులు ప్రసంగించారు. సమన్వయకర్తగా రహ్మానుద్దీన్ వ్యవహరించారు. ఎన్‌బిటి తెలుగు సంపాదకులు, దక్షిణ ప్రాంత అధికారి డాక్టర్ పత్తిపాక మోహన్ సభకు స్వాగతం పలికారు. రాష్ట్రీయ ఈ–పుస్తకాలయ గురించి ఆయన పరిచయం చేశారు. పుస్తక అనువాదకులు మంచికంటి, పద్మజ, రహ్మానుద్దీన్, రహమతుల్లా, బాలవికాసకారులు పాల్గొన్నారు.

నేటి కార్యక్రమాలు...

(సోమవారం) మధ్యాహ్నం 2 గంటల నుంచి పిల్లల కోసం మట్టి హస్తకళల వర్క్‌షాప్, సాయంత్రం 6 గంటలకు విశాలాంధ్ర బుక్ హౌస్ కొత్త పుస్తకాల ఆవిష్కరణ, రాత్రి 7 గంటలకు 'గ్రంథాలయాలు–సమాజం' అంశంపై వక్తల మేధోమథనం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పుస్తక ప్రదర్శన స్టాల్‌ను పరిశీలిస్తున్న బాలలు

పుస్తక ప్రదర్శన స్టాల్‌లో పరిశీలిస్తున్న జేసీ గోపాల కృష్ణ

పుస్తక ప్రదర్శనకు విచ్చేసిన ఓ పాఠశాల ఉపాధ్యాయుడు, విద్యార్థులు

ఉత్తమ ఫలితాలే ధ్యేయం

- ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా విద్యా బోధన
- బాపట్ల జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం

ముఖాముఖి

ప్రజాశక్తి -బాపట్ల జిల్లా



ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలే ధ్యేయంగా తాము పని చేస్తున్నట్లు బాపట్ల జిల్లా విద్యాశాఖాధికారి ఎస్. పురుషోత్తం తెలిపారు. పాఠశాలల్లో నాణ్యమైన విద్యా భోదన కోసం సమిష్టి కృషితో పాటు ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన అందించడానికి తగిన కషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో విద్యారంగ అభివృద్ధి కోసం అమలు చేస్తున్న సంక్షేమ, విద్యా పథకాల అమలు, అత్యుత్తమ ఫలితాల సాధన కోసం చేస్తున్న కృషి గురించి డిఇఒ ప్రజాశక్తి ముఖాముఖికి వివరించారు. అవన్నీ ఆయన మాటాల్లోనే..

గతంలో విద్యావిధానం అమలులో భాగంగా ప్రధానోపాధ్యాయులు ,ఉపాధ్యాయులు పలు యాప్‌ల కారణంగా ఇబ్బందులు పడ్డారు. ఈ విద్యాసంవత్సరం నుంచి లీప్ యాప్ ఒక్కటే అమలు చేస్తున్నారు. జిల్లా లోని 25 మండలాల్లో 1,315 పాఠశాలలు ఉన్నాయి. అన్ని పాఠశాలలకు విద్యామిత్ర పథకం కింద కిట్లు పంపిణీ చేశారు. జిల్లాలో తల్లికి వందనం పేరుతో 1.60 లక్షల మందికి తల్లుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేశారు. నాడు–నేడు పథకం ద్వారా జిల్లాలో ఫేజ్ –1 క్రింద 272 పాఠశాల భవనాలను అభివృద్ధి చేశారు. నాడు – నేడు ఫేజ్ –2 కింద జిల్లాలో 436 పాఠశాల భవనాలను అభివృద్ధి చేశారు. విద్యార్థులలో సైన్స్ పరిజ్ఞానాన్ని మరింత పెంచే చర్యల్లో భాగంగా వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నారు. ఈ విద్యాసంవత్సరంలో పాఠశాల స్థాయి, మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్లు, జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించారు. ఎకో ఫ్రెండ్లీ మెటీరియల్, హెల్త్ అండ్ క్లీన్లీనెస్, సాఫ్ట్ వేర్ యాప్స్, క్లైమేట్ అండ్ ఎన్విరాన్మెంట్ చేంజెస్, మ్యాథమెటిక్స్ మోడలింగ్ అంశాల ఆధారంగా విద్యార్థులు ప్రదర్శనలు ఏర్పాటు చేసేందుకు తగిన కసరత్తు జరుగుతుంది. విద్యా హక్కు చట్టం ద్వారా జిల్లాలోని ప్రైవేటు, అన్ ఎయిడెడ్ స్కూళ్ళలో 2025–26 విద్యా సంవత్సరానికి గాను అర్హులైన పేద విద్యార్థులకు 25 శాతం సీట్లను కేటాయింపుల కోసం తగిన చర్యలు తీసుకున్నాం. రాష్ట్ర ప్రభుత్వం 2025–2026 సంవత్సరం నుంచి పాఠశాలలను పునర్వ్యవస్థీకరణ చేస్తుంది. ఈమేరకు జిల్లాలో ఇప్పటి వరకు ఉన్న 6 రకాల పాఠశాలల స్థానంలో 9 రకాల పాఠశాలలు వచ్చాయి. ఎల్‌కేజీ, యూకేజీ బడులను శాటిలైట్ ఫౌండేషన్ పాఠశాలలుగా ఏర్పాటు చేశారు. ఒకటి, రెండు తరగతులు కలిపి ఫౌండేషనల్ స్కూల్స్‌గా ఏర్పాటు చేశారు. ఇవి జిల్లాలో 112 ఉన్నాయి.1, 2 తరగతులతో పాటు 1 నుంచి 5 తరగతులు ఉండే వాటిని బేసిక్ ప్రాథమిక పాఠశాలలుగా ఏర్పాటు చేశారు. జిల్లాలో ఇవి 757 ఉన్నాయి. 1నుంచి 5 తరగతులు ఉండి 45 మంది కంటే ఎక్కువ విద్యార్థులున్న పాఠశాలను ఆదర్శ ప్రాథమిక పాఠశాలలుగా మార్చారు. ఇవి జిల్లాలో 209 ఉన్నాయి.ప్రాథమికోన్నత పాఠశాలలు 47, ఉన్నత పాఠశాలలు 189 మొత్తంగా జిల్లాలో 1,315 పాఠశాలలు ఉన్నాయి. గ్రామస్థాయిలో ప్రాథమిక పాఠశాలలను పెంచే దిశగా కృషి చేస్తున్నారు. 9వ తరగతి విద్యార్థులకు మార్చి లోనే సిలబస్ పూర్తి చేసి అప్పటి నుంచి 10వ తరగతి సిలబస్ బోధిస్తారు.

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు గతేడాది 10వ తరగతి ఫలితాల్లో సత్తా చాటారు. బాలికలు అత్యధిక మార్కులు సాధించారు. గతేడాది జిల్లాలో 9 పాఠశాలల విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది 12 పాఠశాలలు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాయి. పందిళ్ళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని సజ్జా దివ్యశ్రీ 596 మార్కులు,పెసర్లంక జడ్‌పి హైస్కూల్ విద్యార్థిని త్రిపురనేని సుహిత 594 మార్కులు, ఈపురుపాలెం, చెరుకూరు,శంకవరప్పాడు జడ్‌పి హైస్కూల్ విద్యార్థులు ఊట్ల హిమబిందు,నెల్లూరి మహాలక్ష్మి,భూపతి తేజస్వంత్ 592 మార్కులు సాధించారు. మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ 2.0 జిల్లా స్థాయి కార్యక్రమం మేదరమెట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. జిల్లా లోని అన్ని పాఠశాలల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల ప్రగతి నివేదికపై తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు చర్చించారు. పాఠశాలల్లో సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకున్నారు. తల్లి పేరుతో ఒక మొక్క నాటే విధానంపై విద్యార్థులందరికీ మొక్కలు పంపిణీ చేశారు. గంజాయి, మాదక ద్రవ్యాలు లేని సమాజం కోసం పాఠశాల స్థాయి నుంచే తగిన చర్యలు తీసుకుంటున్నారు. మాదకద్రవ్యాల నిరోధానికి అన్ని పాఠశాలల్లో ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేశారు.